నేటినిజం

# సాహితీ కెరటాలు

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 13-4-2023


## తాళి ఎగతాళి చేయదా?

గుండె నిండా ప్రేమ ఒకరిమీద
గుండె మీద తాళి మరొకరిది
ఆ ఆలిని ఈ తాళి ఎగతాళి చేయదా
గుండెల్లో ప్రేమ జ్ఞాపకం లోలకం అవ్వదా!

కాలం కదలకుండా ఉంటే బాగుండని
మనసారా ప్రేమించిన రోజులు
ఆ రోజు అన్నీ త్యాగాలే
ఈ రోజు ప్రేమను త్యాగం చేసే స్వార్థం!

అభిమానాన్ని అమ్ముకొని
ఆస్తుల అందల మెక్కిన అల్పబుద్ధి!
ప్రేమను పెంచుకున్న మనసు
ఉరితాడును అల్లుకుంటుంది!

జీవితంలో గతం పీడకలలా
నీడలా వేలాడుతూనే ఉండాలా
ప్రేమంటే అర్థం అమరత్వం
మరి ఆత్మహత్యలో ఉందా అర్థం!

నీది కానిది దూరమయితే
నీ దారి మారక సాగిపో నీకై
ఎదురుచూసే అభిసారికను చేరేదాకా
చేదు జ్ఞాపకం చెదిరిపోయేదాకా!

పారే నది దారిలో రాయి వచ్చిందని
బీరిపోయి భీరువై నిలబడిపోతుందా
వీలయితే దూకుతుంది కాకుంటే
మలుపు తిరిగి సాగిపోతుంది మళ్ళీ!

జారిపోయిన క్షణాలన్నీ రాలిపోయిన పూలే!
నిలిచిపోయినవి ఇచ్చు నిజమైన ఫలాలు!!



-జగ్గయ్య.జి
9849525802

పుస్తక సమీక్షలు

# దైవానికి చేరువ చేసే వ్యాసాలు

భారత దేశము వేద భూమి. ఆధ్యాత్మిక విజ్ఞాన ఖని. ఎందరో మహానుభావులు తమ ఆలోచనలతో ఈ దేశ తత్త్వ చింతనను సుసంపన్నం చేసారు. చేస్తూనే ఉన్నారు. జీవితంలో ప్రగతి కోసం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి నేర్పుతూనే ఉన్నారు. అందుకే మన పూర్వులు **"వినదగు నెవ్వరు చెప్పిన'** అన్నారు.

వెంకట వినోద్ పరిమి బాగా చదువుకున్న వారు. ప్రస్తుతం ఉద్యోగరిత్యా సింగపూర్‌లో స్థిర పడ్డారు. తన గత జన్మ వివరాలు తెలిసిన జ్ఞాని. జన్మతః తన చుట్టూఉన్న ఆధ్యాత్మిక వాతావరణంలో తన అనుభవాలను దైవంతో ముడిపెడుతూ వాటి వెనుక ఉన్న విశిష్టతలను 'దైవంతో నా అనుభవాలు' అన్న శీర్షికతో రెండు సంపుటిలను వెలయించారు. మొదటి సంపుటి Divine Experience అన్న టైటిల్‌తో ఆంగ్లంలో ప్రచురించబడింది. విశ్వవ్యాప్తంగా ఎందరో చింత నపరులు వినోద్‌కు దగ్గరయ్యారు. ఎన్నో విషయాలపై తమ కుతూహలాన్ని వెలిబుచ్చి ఈ రచయిత నుండి సమాధానాలు పొంది సంతృప్తుల య్యారు. వ్యక్తిగా, ఆధ్యాత్మిక శక్తిగా, సమున్నత స్థానం పొందిన వీరిని డెల్హీ యూనివర్సిటీవారు తమ డాక్టరేట్‌తో సత్కరించారు. కుదిరితే ప్రతి నెలా తిరుమల వెళ్ళి వస్తుంటారు. జాతర శాస్త్రంలో కూడా మంచి ప్రావీణ్యత ఉంది. తన పుస్తకాల అమ్మకం ద్వారా వచ్చిన ధనాన్ని తి.తి.దే వారి గోరక్షణ నిధికి సమర్పిస్తారు. జీవితంలో ఎన్నో కష్టాల నెదుర్కొని, సుఖ దుఃఖాల మూలాలను అన్వేశిస్తూ, వాటి నివారణ మార్గాలు వెదుకుతూ ఉంటారు. కర్మ సిద్దాంతాన్ని బలంగా నమ్మే వినోద్ గారు గత జన్మలలో చేసిన ప్రారబ్ధ సుకృత కర్మల ఫలితం మరియు ప్రస్తుత జీవితంలో చేస్తున్న మంచి చెడుల 'క్రియమన' కర్మల ఫలితాన్ని తప్పక అనుభవించవలసి వస్తుందని నమ్ముతారు.

వినోద్ రచనలు చదివిన పాఠ కులు ఎంతో మంది ఆయనను సం ప్రదించి తమ సందేహాలకు సమాధా నాలు పొందలిగారు. వారి ప్రశ్నలకు రచయిత ఇచ్చిన సమాధానాలతో కొన్ని, ముఖ్యమైన వాటిని, అందరికీ అన్వయించే సందేహ సమాధానాలను ఈ 'దైవ మీమాంస' ద్వారా మనకు వెల్లడి చేస్తున్నారు. రచయిత చెప్పిన వివరాలను, రచయిత, కథకులు యం. రమేష్‌కుమార్ అక్షరీకరించారు. 3 దశాబ్దాలుగా రచయిత దర్శించిన ఎన్నో పుణ్య క్షేత్రాలలో, ప్రయాణాలలో ఎదురైన సంభ్రమాశ్చర్యకరమైన అనుభవాల సారాంశం ఈ సంపుటి. తన ఆధ్యాత్మిక యానం లో కలుసుకున్న యోగులు సిద్దులు వెలిబుచ్చిన వివరాల ప్రోవు ఇది. వీలైనంత శాస్త్రీయత జోడించబడటం ఈ గ్రంథం ప్రత్యేకత. 'మీ మాసం' అన్న పదానికి నిఘంటువు అర్థం- వైదిక శాస్త్ర పద్ధతులలో ధర్మాన్ని విశ్లేషించుట, సంస్కృత ఆస్తిక విధానంలో 'మీమాంస' ఒకటి అంటారు. వేద వ్యాసుని శిష్యుడిగా పరిగణించబడే జైమిని మహర్షి మీమాంస సూత్రాల్ని వ్రాసినట్లు చెబుతారు. ఈ పుస్తకాన్ని 'ఆధ్యాత్మిక సందేహాలు సమాధానాలు' గా చెప్పబడినా గాని, రచయిత వివిధ సందర్భాలలో ఎదుర్కొన్న ప్రశ్నలకు





సమాధానాలుగా 22 అధ్యాయాలలో వివరించారు.

**ఈ గ్రంథంలో చెప్పబడిన కొన్ని మంచి మాటలు:**

**భగవంతుని ఉనికి దీపపు వెలుగులా సర్వ వ్యాపితం.**

**నువ్వెవరు?** అన్నది చాలా చిన్న ప్రశ్న. కాని సమాధానం అంతు తెలియనంత పెద్దది. నీలోకి నీవు అంతర్ముఖుడైనపుడు మాత్రమే నిన్ను నువ్వు తెలుసుకొనగలవు. జిజ్ఞాస ఆధ్యాత్మిక మార్గానికి తొలిమెట్టు.

కర్మ ఫలాన్నెవరూ తప్పించలేరు. రోజూ చేసే మంచి చెడు పనులు 'క్రియమన కర్మలు'.

అంతాదేవుడే చేస్తున్నాడు అనుకున్నట్లు, దేవుడి ప్రమేయం ఏమీ లేదు అనుకునే వాళ్ళు కూడా ఉన్నారు.

కష్ట సుఖాలు భగవంతుడనే వాడికి కూడా వస్తాయి.

మనకు నమ్మకం ఉన్నా, లేకున్నా, దేన్నీ కించపరుచరాదు. ఆధ్యాత్మిక మార్గంలో సర్వజ్ఞత సర్వ వ్యాపకత సర్వ సమర్థత ఉన్న గురువు అవసరం.

మనం ఏదైనా దానంగా తీసుకుంటున్నామా? దక్షిణగా గ్రహిస్తున్నామా? లేక బహుమతిగా తీసుకుంటున్నామా? అనేది తెలియాలి.

ఇంతేకాకుండా పూజలు ఫలి స్తా యా? కలలు నిజమౌతాయా? దేవుడికి దీపం ఎందుకు పెట్టాలి. దానానికి దక్షిణకు తేడా ఏమిటి? లాంటి ప్రశ్న లకు ఏ శాస్త్రీయమైన సమాధానాలు దొరుకుతాయి ఈ గ్రంథంలో.

'దైవమీమాంస' లోని మరో విశేషం. వేంకట వినోద్ పరిమిగారు తన ఆలోచనలకు 'కంక్లూజన్'గా భతవద్గీతలోని శ్లోకాలను ఉదహరిం చటం మరియు అన్వయించటం.

ఉత్తర భారతదేశంలో వైష్ణోదేవి ఆలయానికి వెళ్ళే దారిలో ఉన్నఅర్ధకుమారి ఆలయం, పచ్‌మడీ (ఉత్తర ప్రదేశ్)లోని జటాశంకర్ దేవాలయం. శివుడిని వెంటాడిన బస్మాసురుడికి సంబంధించిన కథకు సంబంధం వివరించటం, చిదంబరం దేవాలయంలోని బిల్వమాల రహస్యం వివరించటం బావుంది.

"ఈ పుస్తకం మిణుగురులా చీకట్లో కాసిని వెలుగు రవ్వలను వెదజల్లే ప్రయత్నమే తప్ప, ఎవరి నమ్మకాలను, మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం ఎంత మాత్రమూ కాదనటం రచయిత కున్న ఒదిగి ఉండే మాడెస్టీ (Modesty) స్వభావాన్ని తెలియ చేస్తుంది. నిండుకుండ తొణకదు కద! వేద విజ్ఞాన సారాన్ని దైవత్వంలోని మహత్తును పాఠకులకు ఎరిక పరిచే ఈ ప్రయత్నం హర్షణీయం. అభిలషనీయం కూడా!

భారతీయ ఆధ్యాత్మిక తత్త్వం ఒక మహా సముద్రంలాంటిది. ప్రయత్నించిన వారికే మణులు మణిక్యాలు దొరుకుతాయి. చిత్తశుద్ధితో ప్రయత్నించని వారికి నత్తగుల్లలు లాంటి వ్యర్థాలు కనబడుతాయి.

ప్రతులకు: వెంకట వినోద్ కుమార్
సెల్: 8558899478



- కూర చిదంబరం
సెల్: 8639338675

# తేనెపట్టులాంటి మంచి కథలకు ఆటపట్టు బూర్గుసెట్టు

'బూర్గుసెట్టు' కథా సంకలన రచయిత శ్రీ నవల్లభూమయ్యది తండ్రుల కాలం నుండి కాజగ్‌నగర్, వాళ్ళ తాతలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎలగందుల బావుపేట నుండి కాగజ్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. కాగజ్‌నగర్ నేటి కొమురంభీం జిల్లాలోని ఒక గ్రామం. నిజాం నవాబ్ కాలంలో కాగిత పరిశ్రమకు మరియు సర్ సిల్కు అన్న పేరుతో వస్త్ర పరిశ్రమకు పేరుగాంచినది. ఆనాడే ఎయిరోడ్రోం ఉన్న గ్రామం. మహారాష్ట్ర బార్డర్ జిల్లా కావటం వల్ల అక్కడి తెలుగు-అంపశయ్య నవీన్‌గారు తన ముందు మాటలో పేర్కొన్నట్లు తెలంగాణ తెలుగు కాదు. తెలుగులో మరాఠీపదాలు దొర్లుతా నల్ల భూమయ్యగారు 1960 నుండి వ్రాస్తున్నారు. కొంతకాలం విరామమిచ్చి తిరిగి 2006 నుండి వ్రాస్తున్నారు. నాటి ప్రముఖ పత్రికలన్నింటిలోనూ వీరి కథలు ప్రచురించబడి అంపశయ్య నవీన్ సరసన నించోబెట్టాయి. చాలా తక్కువగా వ్రాసే భూమయ్యగారి కథలు ఇంత వరకు రెండు సంపుటాలుగా ప్రచురించబడ్డాయి. పత్రికా భాషలో వచ్చిన "భూమి ఇంకా గుండ్రంగానే ఉంది" వీరి మొదటి సంకలనం కాగా వీరి "బూర్గుసెట్టు" తెలంగాణ వాడుక భాషలో వ్రాసిన రెండవ సంకలనం చదువు అంతంతగా ఉన్న







వీరి తలిదండ్రులు విద్య ప్రాముఖ్యతను గ్రహించి హైద్రాబాద్‌లో ఇంజనీరింగ్ చదివించారు. న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ హైద్రాబాద్ శివారులో సైంటిస్ట్‌గా పదవీ విరమణ గావించిన వీరికి చిన్నతనం నుండే సాహిత్యాసక్తి ఉంది. 8వ తరగతి నుండే అన్ని తీర్ల పుస్తకాలు చదివారు.

రేల లల్ల కిరాయకు తెచ్చుకుని లైబ్రరీలల్ల కథల పుస్తకాలు, నవలలు, వార మాసపత్రికలు చదివేవారు. కీ॥శే॥ సామల సదాశివగారి ముఖ్య శిష్యులు నారాయణగౌడ్ గారితో పరిచయం ఉంది. కొడవటిగంటి, బుచ్చిబాబుగారలు. **'తనకు తోచిన, ఆత్మ సంతృప్తినిచ్చేది రాయటం రచయిత పని"** అని విశ్వసించే భూమయ్యగారి కథనం కూడా భూమయ్యగారిలాగే ప్రత్యేకంగా ఉంటుంది. పాత్రల సంభాషణలో ఆకస్మాత్తుగా రచయిత జొరబడుతాడు. తత్త్వాన్ని ప్రకటించుతాడు. అంతే ఆకస్మాత్తుగా ఓ హిందీ సినిమాలోని పాటనో,తెలుగు సినిమాలోని పాటలోని కొన్ని చరణాలు 'కోట్' చేస్తారు మళ్ళీ కథలోకి వస్తారు. కథల్లో వీరి వివరణ అత్యంత విపులంగా ఉంటుంది. సమస్యలను హృద్యంగా చిత్రీకరించటం మాత్రమే రచయిత బాధ్యతగా, విశ్వసించే భూమయ్యగారు సమాజాన్ని సంస్కరించటం లాంటి మహత్తర బాధ్యతలు రచయితకు ఉంటాయనుకోవటం పొరపాటుగా భావిస్తూ ఇరివెంటి కృష్ణమూర్తిగారి కోట్‌లను ఉటంకిస్తారు.

తన చుట్టూ ఉన్న పరిసరాలు ప్రజలకు పరిశీలించి కథలు రాస్తారు భూమయ్యగారు. తను పుట్టి పెరిగిన ఊరి కాగితపు పరిశ్రమ, అందుండే మెషీన్లు, పనిచేసే కార్మికులు బాగా తెలుసు. నష్టపరిహార చట్టాలలోని లొసుగులు తనకు అనుకూలంగా మలుచుకోవాలని ప్రయత్నించి విఫలం అయిన బల్రాం కథ **"కొండ నాలికకు మందువెడ్తే..."** నవాబుల రుబాబులు గొన్ని నారాయణకు ఉన్నాయి. తారను పెళ్ళి చేసుకుంటాడు కాని కాపురానికి తెచ్చుకోడు. పెద్దల జోక్యంతో నారాయణ తారలు కలసి ఉంటారు. గప్పుడు నారాయణ, తారల సంస్కారం- **"ఇక అందాల ఉయ్యాలలూగించనా?"**అని తార. **" నీ కడ సురలోక భోగాలే!"** అని నారాయణలు (కొత్త తార కథ) పాడుకున్నారట! కిష్టయ్యది కులం పని. ఇత్తడి బిందెలు, గసుంటియి జేసుడు. చదువుకుని కంపెనీల ఉద్యోగం చేస్తోన్న ఈ కథకుడి అత్తవారూరు కిష్టయ్య ఊరు ఒకటే. ఎదుగక ముందు కిష్టయ్య కథకుడిని గమనించి అసూయ ప్రకటించేవాడు. కాలక్రమాన కిష్టయ్య కథకుడికంటే ఆర్థికంగా మెరుగుపడుతాడు. అప్పుడు కిష్టయ్య కథకుడిని చిన్నచూపుచూస్తాడు. ఆముదం చెట్టులాంటి కిష్టయ్య మర్రిచెట్టు అవుతాడు. ఏ ఎండ కా గొడుగు పట్టే కిష్టయ్య 'పెద్ద సదువులు సదివిన మీకు సిన్నపాటి గ్యానం కూడా అబ్బకపాయె (పే.128) అంటూ విచారపడుతాడు. పెద్దసేట్లు, పోలీసోల్లు, ఇన్కంటాక్సులకు కిష్టయ్య చతికలపడతాడు. **"మా అసుంటోలమంత బూర్గుసెట్లం. మీరేమో మామిడిసెట్లు"** అంటాడు కిష్టయ్య (బూర్గుసెట్టు) నడమంత్రపు సిరికి పొంగి పోవద్దనే ఈ కథలోని సందేశం బాగుంది. కొంచెం ఓపిగ్గా చదువుతేగాని రచయిత వాడిన పదాల వెనుక అర్థాలు అర్థం కావు. ఒక తనదైన క్రొత్తశైలి సృష్టించిన రచయితకు అభినందనలు.

**ప్రతులకు:** యన్. భూమయ్య
42-452, గాయత్రినగర్
స్ట్రీట్-2, మౌలాలి
హైదరాబాద్-40
సెల్: 9701278757

-జయసూర్య
సెల్:9014948336
9394775088



## కరిగే కొవ్వొత్తి



కొవ్వొత్తిలా
కరిగిపోతూ వొరిగిపోతూ
జీవనాంధకారాల్లో
వెలుగు వెల్లువగా ప్రవహించడం
అరమరికలు లేని
ఆత్మీయతకు అచ్చమైన
ఆనవాలు కావడం
ఆమెకు
ఉగ్గుతో కాదు
ఊడిగంతో పెట్టిన విద్య.

ఒలింపిక్ పతకాలూ-
జ్ఞానపీఠ్ అవార్డులూ
మాన్ ఆఫ్ ది ఇయర్‌లూ-
దునియాకీ కరోడ్ పతీలూ
ఆమె ప్రేమముందు జీరోలే

ఆమె చూపులోనే వుంది
ఊటీ చల్లదనం

ఆమె మొక్కవోని ధైర్యానికి
సజీవరూపం
ఆమె పిలుపులోనే వుంది
జీవనరాగం.
కష్టాల్నీ కన్నీళ్ళనీ
చిరునవ్వుతో ప్రతిఫలించే
మమతాను రాగాల దర్పణం
నా బాధల గాథల జీవితం
అమ్మకే అర్పణం.

-ఎం.ఆర్.వి.
సత్యనారాయణమూర్తి,
సెల్:8819246414

## నానీలు



కుర్చీ
పెరిగిందా?
నీడలాంటి శత్రువూ
పెరుగుతున్నాడు చూడు!

-డా. సి. భవానీదేవి
9866847000

# మార్చుదాం లోకాన్ని !

ఓ ఆధునిక సమాజపు హైటెక్ యోధుల్లారా
స్వార్థానికి నాలుకజాపే జల్సా రాయుల్లారా
అబద్దాలతో అంటకాగే నవ నాగరికుల్లారా
నిజాయితీని నిలువెత్తు అద్దంగా మలచి
సత్యాలను నడిబజారులో ఆరేసినాం రండి !
వెలవెల పోతున్న అబద్దాలనొకసారి చూస్తూ
వెలగట్టలేని వాస్తవాలనొకసారి దర్శించండి
వెలిగి పోతున్నట్లు చేసే గారడీలు చూడండి !

ఆహుతైన వీరుల జ్ఞాపకాల చిహ్నాలను
వీధివీధినా , పల్లెపల్లెనా , చెట్టుచెట్టునా
చౌరస్తాల్లో తెగువతో మా నరాలను తెంపి
తీగలుగా గట్టి త్యాగాలన్నీ ఆరేసినాం రండి
నీతీ నిజాయితీలతో శక్తిని కూడబలుక్కొని
ఒక్కసారిగా ఇళ్ళవాకిళ్ళ నుండి కదలండి
ఊరు పొలిమేర్లనుండి ఉవ్వెత్తున కదలండి !

చరిత్ర కనుమరుగయ్యేలా కరాళనృత్యం చేస్తూ
అవినీతి సంద్రాన్ని సృష్టించి అరాచకాలెన్నో చేస్తూ
భరితెగించిన మాయగాళ్ళను భస్మం చేయడానికి
కళ్ళుతెరిచి ముందుకొచ్చి ఒక్కసారి అన్యాయాలను
చూడ్డానికి రండి అందరమొక్కటై తరిమేద్దాం
బ్రతుకులాగంజేసి బజారున పడేస్తున్నరు రండి !

ఒరేయ్ ! నయవచకుల్లారా !మీ స్వార్థాల
ప్రత్యేకతకు మేం కాగడాలమైనాం
మా ప్రాణాలిచ్చినాం ! సంపదలిచ్చినాం
మా సమయమిచ్చి చావుకు దగ్గరైనాం !

మీ అభివృద్ధికి మేం చెమట చుక్కలమైనాం
మీ భద్రతకు మేం ఆత్మాహుతుల మైనాం
మీ ఆలోచనల స్వేచ్ఛకు మేం గాలిమైనాం
నాడు శ్వాసనిశ్వాసలమై ఊపిరులిచ్చినాం
నేడు నిరాశ్రయులమై నీరుగారి పోతున్నాం
మా భళిదానాలే మీకాస్థులైనాయ్ నేడు !

మా త్యాగాలను మనసుతో కీర్తించండి
మా నిజాయితీనొకసారి దర్శించండి
మా గుండె తెగువలను ప్రదర్శించండి
మా నరనరాన నిండిన సాహసాలను
గుండెల్ని పిండిన కాంక్షలను గుర్తించండి
రండి , అందరమొక్కటై తరిమేద్దాం
బ్రతుకులాగంజేసి బజారున పడేస్తున్నరు !

పౌరుషంతో సమర శంఖమూదిన
అమర వీరుల రక్తపు మరకలను
గజ్జెల చప్పుళ్ళను, పిల్లల పిడికిళ్ళను
డప్పుల దరువులను చూసి, ఆనాడు
చెట్లుచేమలు చేతులూపినయ్
పంటచేళ్ళు దారిచ్చి పక్కకొరిగినయ్
పానాదుల్లో పరికికంపల ముండ్లు
పాతరేసినట్లు ముడుచుకున్నయ్
పాలుతాగే చంటిపిల్లలు, పడుకున్న
పెద్దమనుషులు డప్పుల దరువుకు
దుంకనోళ్ళు పాపాత్ములైరి ఆనాడు !

కథ తారుమారైంది ! పాత్రలు పత్త మల్పినయ్
నిజాలనిప్పుడు తలచుకొంటే నిద్రలోనైనా
నిలువెత్తుగ ఉళ్ళి పడుతుంది మనసు
వాళ్ళేనా వీళ్ళు? మేం కళ్ళలో పెట్టుకొని
చూసుకొన్నోళ్ళేనా? ఆనాటి నావాళ్ళేనాని
పులితోళ్ళు గప్పుకున్న మోసాల మేకలా వీళ్ళని
పాడువడ్డ పథకాలను మొఖానికతికిచ్చి
పైకమందుకొని పత్తాలేక పోతున్నరెందుకురా?
తాయిలాలతో ఆశతో తాగుడు నేర్పించి
ఊర్లనిండా తార్పుడు గాళ్ళను చేస్తిరి గదరా
ఎవుసమెండుకపోయి ఎటుగాని దారిజూపి
బ్రతుకులు నడుమంత్రంజేసి ఏంగట్టుక పోతార్రా
రండిరా అందరమొక్కటై ఒక్కొక్కన్ని తరిమేద్దాం
జీవితమాగంజేసి బజారు కీడుస్తున్నరు గదరా !

మరి నేడేమో ...
కవుల కలాలన్ని నిజాలు రాయక
గాయక గళాలన్ని వచ్చింది పాడక
పత్రిక బలాలన్ని ప్రకటనలు నింపుకొని
ఉద్యోగ బలగాలన్ని ఇచ్చింది పుచ్చుకొని
ఉద్యమ పిడికిళ్ళన్నీ వంతపాట పాడుతూ
కార్మికశక్తులన్నీ సొంతదార్లు చూసుకుంటూ
స్వార్థాల ముసుగులో సరెండర్ అయిపోయి
తెగువను బిగుతుగా ముడేసుకొని కూర్చొని

మనకెందుకని గజగజ గజగజ వణుకుతున్నాయి
అందుకే ... ఇక ఎవ్వరొచ్చినా ,
ఏ దేవుడు దిగొచ్చినా , ఇక మారదులోకం

ఇప్పుడింకా ...
మేధావుల మెదళ్ళు నిశ్చలమై , నిర్వీర్యమై
నిర్లిప్తంగా , నిరాధరణతో మూగబోయి
మాటరాక మౌనంగా రోధిస్తున్నాయి
అన్యాయాలు చూడలేక , అకృత్యాలు వినలేక
కళ్ళుచెవులు మూతబడి ముందడుగేయలేక
కాళ్ళు చచ్చుబడి తడబడుతున్నాయి
అందుకే ... ఇక ఎవ్వరొచ్చినా, ఏ దేవుడు
దిగొచ్చినా ఇక మారదు లోకం !

అహంకారులకు , అధికారమున్న వారికి
అడుగులకు మడుగులొత్తి పైకమిస్తేనే
పనుల మతలబు చెల్లుబాటైతుంది
వ్యాపారులను ట్యాక్సులతో కొల్లగొడుతున్నారు
ఉద్యోగస్థుల , మధ్యతరగతి వాళ్ల కష్టార్జితాన్ని
పేదల ఉచితాలకే పంచి పెడుతున్నారు !

అన్నివైపులా అవినీతి కార్చిచ్చులా అంటుకుంది
అందుకే ... ఎవ్వరొచ్చినా, ఏ దేవుడు
దిగొచ్చినా , ఇక మారదు లోకం?

నీకెంత? నాకెంతని బేరం ఒప్పుకుంటేనే
సహకారం! లేదంటే తీవ్ర పరిహారమే
కుదరక తిరస్కారమైతే సంహారమే
ఇదే నేటిభారతంలో ఒక్కొక్కరి మెదళ్ళలో
స్వార్థంపై పాతుకుపోతున్న మమకారం
అందుకే .... ఎవ్వరొచ్చినా, ఏ దేవుడు
దిగొచ్చినా ఇక మారదు లోకం?

అందుకే మిత్రమా , ఏదేమైనా కానియ్ ,
ఏదేమైనా కానియ్ ! కానియ్ ఏదేమైనా
గుండెలోని రక్త కణాల్ని నిద్రపోనియ్యం
మన భుజస్కంధాలపై మనమే బాధ్యతమోస్తూ
ఒకరికి ఒకరం తోడై , మార్చుదాం ఈ లోకాన్ని
గౌతమ బుద్ధున్ని , గాంధీ మహాత్మున్ని ఆజాద్ ,
భగత్ లను , అల్లూరి , అరవిందఘోష్ లను
తిలక్ , సుభాష్ లను , రామక్రిష్ణ , వివేకానందలను
మండేలా , మార్టిన్ లూతర్ మహానుభావులను
మళ్ళీ చదువుదాం! మళ్ళీ మళ్ళీ చదువుదాం
అర్థమయ్యేదాక అదేపనిగా చదువుదాం !

ఎంతటి కఠిన పరీక్షలెదురైనా గాని
ఎంతటి విరోధాలెదురైనా గాని
ఎన్ని విఘాతాలడ్డొచ్చినా గాని
ఎత్తిన తల దించక ఎదిరిద్దాం రండి !

స్వతంత్ర్య స్వర్ణోత్సవాలు జరుపుకున్న
కీర్తికిరీటాల తేజోమయ ఘనతంత్ర దేశంలో
ప్రాణమున్నంత వరకు పద్దతిగానే
బ్రతికి చూపిద్దాం ! పిల్లలకన్నీ నేర్పిద్దాం

ఎప్పటికైనా గెలిచే వాళ్ళమనే ధైర్యాన్నీ ,
ఆయుధంగా , ఆభరణంగా వాడుదాం
మాటపై నిలబడే మనోధైర్యాన్ని నింపుదాం
త్యాగాల గడ్డపై పుట్టినందుకు గర్విద్దాం
తరలిరండిరా అందరమొక్కటైదాం
మన బ్రతుకులాగంజేస్తున్నరు
సంకల్పశక్తిని పున:స్మరించుకుంటూ ,
సమసమాజ నిర్మాణ సారధ్యానికి ,
జనజాగృత నవభారత మహోదయానికి
సమిధలమై , ప్రపంచశాంతి విజేతలమై
ఎగిరేసే మువ్వన్నెల విజయ పతాక
రెపరెపలను , సూర్యచంద్రుల సాక్షిగా
ప్రకృతి సాక్షిగా , పంచభూతాల సాక్షిగా
ఈ జీవితాన ఈ కనులతోనే చూద్దాం
మార్చుదాం ! ఈ లోకాన్నే మార్చుదాం !



-రాజేశ్ ,
9440460490

## జీవన చక్రం

కాల చక్రం కదలిక లాగే
జీవన చక్రం కదలిక కూడా!
తేడా ఒక్కటే!
కాల చక్రం శాశ్వితం
జీవన చక్రం అశాశ్వితం!
ఆరు ఋతువుల
కాల చైతన్యంతోనే
మానవ జీవితంలోని
ఆరు దశల జీవచలనం!
బాల్యం వసంతంలా చిగురింత,
కౌమార్యం వాన జల్లుల తుల్లింత,
యౌవ్వనం గ్రీష్మ తాప గిలిగింత,
వైవాహికం శరజ్జ్యోష్ణల పులకింత,
వృద్ధాప్యం హేమంత కౌగిలింత,
వానప్రస్థం శిశిరంలా నేలవాలింత!
అనుభవాల పర్వం
స్వప్నాల స్కంధం
పరిమళంపు పద్యం
వొయ్యారాల వచనం

అన్ని కదలికలు ఋతురాగంతోనే!
వేప పూతలు, మామిడి కాతలు
ఆరు రుచుల పచ్చడిలతో
కొత్త కుండల కోలాహలం
పచ్చ పచ్చని తోరణాలతో
పల్లెలన్నీ విందు పసందుల విన్యాసం
పంచాంగ పఠనాలతో
పండితుల భవిషద్దర్శనం
కోకిల కూతలు, కవికోకిల రాతలు
ఉగాదులు, ఉషస్సులూ
అన్ని అందాలు ఋతురాగంతోనే!
ప్రకృతి పులకించేది
ప్రపంచం పరవశించేది
బతుకులు మోహనరాగాలయ్యేది
జగతి జాగృతమయ్యేది
ఈ ఋతువుల చైతన్యంతోనే!



-డా॥కూర్మాచలం
శంకర స్వామి,
9703268858

## పుస్తకం మధుర జ్ఞాపకం

విజ్ఞానపు నిధి పుస్తకం
జీవజలపు నది పుస్తకం
మమకారపు మది పుస్తకం
వెలుగుజిలుగుల గది పుస్తకం
అమూల్యమైన మేలి పుస్తకం
వికాసంతో నింపును మస్తకం
బ్రతుకు పయనంలో తోడు
చిగురింపచేయు మెదడు మోడు
మంచి పుస్తకంతో చెలిమి చేసి చూడు
తీరిపోవును మానసిక గోడు
పుస్తకమే నిజమైన మిత్రుడు
ఒంటరి సమయాన ఆప్తుడు
పుస్తకమే అభిమానపాత్రుడు
పుస్తకమే గారాలవరాల పుత్రుడు
ఓ మంచి పుస్తకం..
లోకాన్ని తెలుపుతుంది
నాకాన్ని చూపుతుంది
శోకాన్ని తరుముతుంది

లౌక్యాన్ని నేర్పుతుంది
వినోదం పంచుతుంది
వికాసం పెంచుతుంది
అజ్ఞానం బాపుతుంది
విజ్ఞావం నిలుపుతుంది
"చిరిగిన చొక్కా నైనా తొడుగుకో
మంచి పుస్తకాన్ని కొనుకో !"
పుస్తకమే పరమౌషదం
ఇది అందరికి విదితమే!
పుస్తకమే మధుర జ్ఞాపకం
కావాలి మనసుకు వ్యాపకం
పుస్తకమా! నీకు వందనం
నీవే మాకు నందన వనం



-గద్వాల సోమన్న
సెల్ నెం:9966414580

## చలి మంటలు

గెనాల గరిక పైన
మంచు ముత్యం
సూర్యోదయాన
రైతు పాదాలను
ముద్దాడింది,

బంగళాలకు
మంచు దుప్పటి కప్పిన
ఉదయ సంధ్య
పేపర్ పంపిణీ కుర్రాడిని
ప్రేమ మీర పలకరించింది.

కోడి కూత తోటి
పాచి పనులు చేసే
బీదరాలి కన్నీటి చుక్కల్ని
మంచు బిందువులు
పరామర్శించాయి.

వేకువకు ముందే
స్టడీ అవర్ క్లాసులకెళ్ళే
బడి పిల్లల దైన్యాన్ని
పొగ మంచు నిండుగ
కప్పి వేసింది

ఎన్నికల వేళ
అధికార ప్రతిపక్షాల
పరస్పర దూషణలు
ఊరూర చలిమంటలై
వార్తల్ని వేడెక్కిస్తున్నాయి



-పేరూరు బాలసుబ్రమణ్యం
సెల్: 98492 24162

## పిచ్చుక కనిపించక..!!

చిన్నిగూడు పెట్టు చోటులేదు
తిండిగింజ దొరుకు తీరులేదు
ఎండవేడిని మించిన రేడియేషన్
గాలిలోన ఎగరలేక పరేషాన్ !!

అయ్యయ్యో ఓ పిచ్చుకమ్మ..
బతకుదారి లేక నీకు ఎన్నెన్ని తిప్పలమ్మ..!!

పురుగుమందు నిలయాలే పంటపొలాలు
పరిశ్రమల కాలుష్యాలతో పల్లె పట్టణాలు
కాంక్రీటు అడవుల్లో కానరాని పచ్చదనం
అభివృద్ధి పేరుచెప్పి జరుగుతున్న హననం !!

అయ్యయ్యో పిచ్చుకమ్మ..
బతుకుదారిలోన నీకు తీర్చలేని తిప్పలమ్మ..!!

కిచకిచమని నీ పిలుపులేవి..??
చకచకమని ఆ గెంతులేవి..??
లేవులేవు కానలేవు ఇంతైనా కానరావు
కనికరమే కరువయ్యెను నేటి క్రూర లోకాన !!

పిచ్చుకమ్మ ఉనికి చూడ మచ్చుకైన కానరాక..
రోజుకొక్క తీరుగాను అంతరించిపోతుంటే..
జాలిలేని మనిషి నేడు పిచ్చుకకో రోజు పెట్టి..
అంతులేని జాలివాన కురిపిస్తూ ఉన్నాడు !!



-పేరిశెట్టి బాబు
9247170800



# విభిన్న సంస్కృతుల నాగరికతల మధ్య అవగాహన సారథి పర్యాటక రంగం

మానవుడు ఉరుకుల పరుగుల జీవితంలో సతమౌతున్న హైటెక్ యుగంలో తీరిక లేక పోటీ పోలికల చక్రభంథ ములో(ఒత్తిడి విషవలయంలో )చిక్కుకున్న ఆధునిక మానవునికి మానసిక ఉల్లాసం కలిగించి విశ్రాంతిగా జీవితం హుషారుగా ఆనందంగా గడుపడానికి ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించు కోవడానికి పర్యాటక రంగం దోహదపడుతుది.

పర్యాటక రంగం ప్రపంచ వ్యాప్తంగా శీఘ్రంగా విస్తరిస్తుంది.

ప్రపంచీకరణ 'కార్పొరేటీకరణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృధి చెందడం వల్ల టూరిజం బహు ముఖంగా విస్తరిస్తుంది. సమకాలీన



సమాజంలో చోటు చేసుకుంటున్న పలు మార్పులు పరిస్థితులు ఒత్తిడి నుండి ఉపశమనం పొందటానికి,' విముక్తి కోసం ఆనందం కోసం కుటుంబ సభ్యులతో స్నేహితులతో ప్రకృతి సందర్శన నూతన ప్రదేశాలను చారిత్రిక కట్టడాలను సందర్శించడం అత్యంత ఆదరణ పొందింది.

వేసవి సెలవుల్లో విద్యార్థులు చారిత్రిక కట్టడాలు ప్రకృతి అందాలు చూడడానికి



నూతన ప్రదేశాలకు విజ్ఞాన విహార యాత్రలకు వెళుతుంటారు.

### పర్యాటక రంగం – ప్రాధాన్యత

ప్రపంచాన్ని ఒకచోట చేర్చే సామర్థ్యం పర్యాటక రంగానికి వుంది. అంతర్జాతీయ రంగములో ఈ రంగం ప్రమేయం అనేక అంశాలలో సానుకూల వృథిని పెంపొందిస్తుంది. దేశ ఆర్థికాభి వృద్ధి, ఉపాధి కల్పనలో టూరిజం ప్రధాన పాత్ర పోషిస్తుంది,ప్రపంచ దేశాల మధ్య శాంతి, సామరస్యం, భౌగోళిక సమగ్రత, సౌభ్రాతత్వాన్ని, మెరుగైన దౌత్య సంబంధాలను బలోపేతం చేయడానికి పర్యాటక రంగం బహుముఖ పాత్ర పోషిస్తుంది. సంస్కృతి చరిత్ర విషయములో పర్యాటకరంగాన్ని పోత్సహించడం కంటె సంరక్షణ చర్యల మీద ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

### పర్యాటక రంగం బిఆర్థికాభివృధి

అభివృధి చెందిన' అభివృధి చెందుతున్న దేశాలలో పర్యాటక రంగం శీఘ్రంగా విస్తరిస్తుంది. మంచి రాబడులతో పర్యటక రంగం రోజు రోజుకు అభివృధి చెందుతూ "పరిశ్రమగా" వర్థిల్లు తుంది. మన దేశములో పర్యాటక రంగం గణనీయమైన ప్రగతిని సాధించింది . స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడములో పర్యాటక రంగం బహుముఖ పాత్ర పోషిస్తుంది. దేశములో శీఘ్రంగా విస్తరిస్తున్న సేవా రంగములో పర్యాటక రంగం ప్రథమ స్థానం దక్కించు కోవడం గమనార్హం. పర్యాటక రంగం వివిధ దేశాల సంస్కృతులు 'నాగరికతలు ఆచారాలు 'సంప్రదా యాలు 'శీతోష్ణస్థితుల మధ్య అవగాహన కు సయోధ్యకు పర్యాటక సౌభ్రాతృత్వ సారథిగా పనిచేస్తూంది. ఆర్థిక వ్యవస్థలో ఆదాయాన్ని సమకూరుస్తూ దేశ ఆర్థికాభివృద్ధి సాధనలో టూరిజం కీలక

పాత్రను పోషిస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పర్యాటకరంగం సుస్థిరాభివృద్ధి సాధనలో చోదక శక్తిగా పనిచేస్తుంది. (కీలక పాత్ర పోషిస్తుంది.) కరోనా వల్ల ఆర్థిక వ్యవస్థ కొంత తిరోగమించినప్పటికి టూరిజం ప్రపంచదేశాల " జిడిపికి" ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. ఎంతో మందికి ప్రత్యక్షంగా 'పరోక్షంగా ఉపాధి కల్పిస్తుంది .పట్టణ 'గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలు తొలగించడానికి గ్రామీణ ప్రాంతాలలో టూరిజం దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు ఉపాధి కల్పనకు గ్రామీణ పర్యాటక రంగం తొడుపడుతుంది.



ప్రభుత్వం పర్యాటక రంగానికి "ఎగుమతుల పరిశ్రమ ప్రతిపత్తి " స్థాయిని కలిపించింది. మౌలిక వసతులు పెద్ద స్థాయిలో సమకూర్చడం వల్ల 2020 లో వార్షిక దేశస్థూల జాతీ య ఉత్పత్తి లో పర్యాటక రంగం వాటా 7 శాతం పైగా పెరిగింది. 8.5 లక్షల కోట్ల వాట కలిగి ఉందని అంచనాలు తెలుపుతున్నాయి. భౌగోళిక పర్యాటక రంగం మనిషికి ప్రకృతికి మధ్య విభిన్న సంస్కృతులు విభిన్న సృజనాత్మకతకు మధ్య సమన్వయాన్ని సాదిస్తు మానవ జాతి ఔన్నత్యాన్ని చరిత్రను మానవుని శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని, అవగాహన చేసుకోవడానికి పర్యాటక రంగం దోహదపడు తుంది. విభిన్న ప్రదేశాలు పర్యావర ణం ప్రకృతి ప్రజల సంస్కృతి భాష ఆహారపు అలవాట్లు వస్త్రధా రణ వంటి విషయాలలో ఉన్న వైవిధ్యాన్ని అవగాహన చేసుకోవ డానికి ఆయా దేశాల సాంస్కృతిక ' నాగరికత 'చారిత్రిక విషయాలను అందరికీ తెలియచేస్తుంది . కోవిడ్ –19 ప్రపంచ వ్యాప్తంగా ప్రతి వ్యవస్థ మీద ప్రభావం చూపింది. నిరుద్యోగం పేదరికం రాజ్యమేలటం వల్ల అనేక కుటుంబాలు విచ్చిన్నమై నాయి.అసంగటిత రంగం కుదేలై నిరుద్యోగం పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా పరిణమిం చింది. కోవిడ్ మహమ్మారి కార ణంగా దేశాల మధ్య రాకపోకలు వర్తక 'వాణిజ్య వ్యాపార 'కార్యకలా పాలు నిలిచిపోయినాయి. పర్యాటక రంగం ఎక్కువగా దెబ్బతిన్నది.

పర్యాటక రంగాన్ని పూర్వ స్థితికి తేవడానికి థీమ్ ను జటొా ప్రతిపాదించింది.ప్రపంచ దేశాలు పర్యాటక రంగాన్ని పునరుద్ధరించి ప్రగతి పథంలో ముందుకు కొనసాగించడానికి అవకాశాలు కలిపించాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది.

### పెరిగిన విదేశీ పర్యాటకులు

ఇటీవల భారతదేశ ప్రభుత్వం "ఇన్ క్రిటిబుల్ ఇండియా "ప్రచాం˘ములో మన దేశం పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి పెరిగింది.విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 6 వేల సంవత్సరాల మనదేశ నాగరికత విభిన్న సంస్కృతులు 'ఆచారాలు సంప్రదా యాలు' కళారూపాలు' వైవిధ్యభరితమైన



'జీవనవిధానాలు' సహజ సంపద నదులు, జలపాతాలు, సెలయేర్లు

సహజ వనరులు మనదేశ ప్రజల ఆచార 'వ్యవహారాలు 'విశ్వాసాలు అలవాట్లు' పండుగలు 'కళలు సాహిత్యం 'సంగీతం 'నృత్యారీతులు '

ప్రాచీన శిల్ప సంపద విగ్రహాలు, వీధులు నోరూరించే వంటకాలు, ప్రకృతి సౌందర్యాలు, సాంస్కృతిక ఆస్తులు మన నాగరికత విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది.

శారీరక దారుఢ్యం బలపరచడానికి మానసిక వికాసానికి 'సాంస్కృతిక రంగ వికాసానికి సాహితీ రంగ అభివృద్ధికి ఆధ్యాత్మిక ధార్మిక భావనలు పెంపొందించదానికి పర్యాటక రంగం ఒక చక్కని వేదిక అని కేంద్ర ప్రభుత్వం పర్యాటక రంగం పాలసీలో పేరుకొన్నది.

ఆధునిక కాలములో పర్యాటక రంగం అభివృధి చెందడం వల్ల దేశాల మధ్య టూరిస్టులు సంఖ్య గణనీయంగా పెరిగింది.

మనదేశంలో యెాగ ఆయుుర్వేదిక్ హోమియోపతి, యూనాని మొన్నగు ప్రత్యామ్నాయ వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి . ప్రపంచ వ్యాప్తంగా టూరిస్టులు వైద్య చికిత్స కోసం మన దేశానికి రావడం వల్ల వైద్య టూరిజం గణనీయంగా పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుండి పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు మెరుగుపడడంవల్ల గ్రామీణ ప్రాంతాలలో పర్యాటక ప్రదేశాల సందర్శనకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య పెరిగింది.

గ్రామీణ పర్యాటక రంగానికి జాతీయంగ అంతర్జాతీయంగ గుర్తింపు వల్ల స్వదేశీ పర్యాటకులు సంవత్సరానికి 10 శాతం చొప్పున విదేశీ పర్యాటకులు 8 శాతం చొప్పున పెరుగుతున్నారు.

### పర్యాటక రంగంలో వెనకబాటు

అధిక జనాభా కలిగిన దేశాలలో మనదేశం రెండో స్థానం. ప్రపంచ ఆర్థిక శక్తిలో మన దేశంది ఐదో స్థానం . పర్యాటకరంగంలో మాత్రం మొదటి 10 స్థానాలలో ఎక్కడ చోటు సంపాదించు కోలేదు. ప్రతి యేటా వచ్చిపోయే సందర్శకుల సంఖ్య ప్రాతిపదికన చూస్తే 2018 నాటికి మనదేశం 34 వ స్థానములో వుంది. 2017 లో ఏడాది 40 వ స్థానములో ఉండేది. పర్యాటక రంగం భారత్ లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

పర్యాటక రంగంలో మొదటి 10 స్థానాల్లో వున్న దేశాలు ఆ దేశాలను సందర్శించిన పర్యాటకుల సంఖ్య వివరాలు ఇలా వున్నాయి.

### పర్యాటకం లో టాప్ 10 దేశాలు

ఫ్రాన్స్ మొదటి స్థానం పర్యాటకుల సంఖ్య (8.9 కోట్లు)

స్పెయిన్ రెండవ స్థానం ( 8.3 కోట్లు పర్యాటకులు)

అమెరికా మూడవ స్థానం (8.0 కోట్లు)
చైనా నాల్గవ స్థానం(6.3 కోట్లు)
ఇటలీ 5. వ స్థానం (6.2 కోట్లు)
టర్కీ 6 వ స్థానం (4.6 కోట్లు)
మెక్సికో 7 వ స్థానం (4.1 కోట్లు)
జర్మనీ 8 వ స్థానం (3.9 కోట్లు)
థాయిలాండ్ 9 వ స్థానం (3.8 కోట్లు)
యునైటెడ్ కింగ్డమ్ 10 వ స్థానం (3.6కోట్లు) పర్యాటకుల సంఖ్య నమోదు అయింది



( చినీతీశ్రీట టూరిజం ఆర్గనైజేషన్ బి2018 నివేదిక)

### ఉపాధికి ఊతం ఇస్తున్న పర్యాటక రంగం

పర్యాటక రంగం ఆర్థికవ్యవస్థ పరిపుష్టికి తోడుపడుతుంది. చాలామంది ఉపాధికి ఊతమిస్తుంది. . భారత్ లోగత ఏడాది లెక్కల ప్రకారం పర్యాటక రంగం 4.26 కోట్ల మందికి ఉపాధి కల్పించింది. దేశ స్థూల జాతీయ ఉత్పత్తి లో9.2 శాతం మొత్తం పర్యాటక రంగం ద్వారానే సమకూరింది, గత ఏడాది పర్యాటక రంగం ద్వారా రూ॥ 16 లక్షల కోట్ల ఆదాయం లభించింది. 2029 నాటికి ఈరంగం ఆదాయం రూ " 35 లక్షల కోట్లకు చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వదేశీ విమానాల ప్రయాణాన్ని కొనసాగించ డానికి" ఉదే దేశ్ కా ఆమ్ నాగరిక్( ఉఢాన్)

పథకాన్ని ప్రారంభిచింది. మనదేశ పర్యాటక రంగం ప్రస్తుతం 6.9 వార్షిక వృద్ధి రేటు నమోదు చేసుకున్నది.గత ఏడాది దాదాపు కోటి మంది విదేశీ పర్యాటకులు మనదేశాన్ని సందర్శించారు.

### పర్యాటక రంగం అభివృద్ధికిప్రభుత్వ సమగ్ర చర్యలు చేపట్టాలి

1 ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి

2) పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టాలి

3) ప్రభుత్వ ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతో పెట్టుబడులను ఆహ్వానిస్తూ



పలు రాయితీలు ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టాలి.

4)గ్రామీణ పర్యాటక రం గాన్ని అభివృద్ధి పరచాలి. ప్రాచీన దేవాలయాలు 'ప్రాచీన శిల్ప కళా సంపద గల చారిత్రిక కట్టడాలను పునరుద్దరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలి.దేవాదాయ శాఖ గ్రామదే వతల ఆలయాలను రక్షించాలి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీన ములో వున్న మాన్యాలు బుములను అన్యాక్రాంతం కాకుండా చట్ట పరమైన రక్షణ చర్యలు చేపట్టాలి.

5) గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజల సంస్కృతిని చేతివృతులను రక్షించాలి .వారి జీవనవిధానం హస్త కళలకు ప్రాధాన్యత ఇవ్వాలి.



6)గ్రామీణ ప్రాంతాల ప్రజల ను వ్యవసాయ టూరిజం 'కల్చరల్ టూరిజం' పర్యావరణ టూరిజం వన్యప్రాణి టూరిజం 'సాహస టూరిజం' జియోటూరిజం హెరిటేజ్ టూరిజం .వైద్య టూరిజం

మతపరమైన టూరిజం లో భాగస్వాములను చెయ్యాలి. జియోపార్కులను .జలపాతాలు సరస్సులు అభివృధి పరచాలి.

7)వన్యప్రాణి సంరక్షణ కేంద్రా లు దేవాలయాలను కలుపుతూ టూ రులు ఏర్పాటు చెయ్యాలి. 8)టూరి స్టులకు వసతి భోజన సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి.

9)పర్యావరణాని కి హాని కలగకుండా

సామాజిక వాతావరణం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

10)పర్యాటక రంగంతో ప్రత్యక్షంగా పరోక్షంగా అనుబంధం కలిగిన వారందరిలోను సాంఘిక సామాజిక చైతన్యం కలిగించాలి. 11)పర్యాటక రంగం అనేది ఉపాధి కల్పనకు సాంఘీక ,'సామర స్యానికి 'దారిద్ర్య నిర్మూలనకు దోహదపడే అంశం పర్యాటకం దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పరుస్తుంది. పర్యావరణాన్ని మెరుగుపరుస్తుంది. 12) రోడ్లు రవాణా హోటల్స్ 'క్యాటరింగ్ 'హస్తకళల రంగాలలో నాణ్యతను వ్యాపార స్థాయిని పెంచుతుంది. 13) దేశ ఆర్థికాభివృద్ధిలో ఉపాధి కల్పన లో మారుమూల ప్రాంతాల అభివృద్ధికి పర్యాటక రంగం చోదక శక్తిగా పనిచేస్తుంది.

14)సమాజములో పర్యావరణ పరిరక్షణ కొరకు పౌరసమాజం ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు సామాజిక సాంస్కృతిక సంస్థలు ఉమ్మడిగా ఉద్యమించాలి. 15) స్వచభారత్..వచ్చదనం,' పరిశుభ్రత పాటించడం ద్వార పర్యాటక రంగం లో ప్రగతి సాధ్యమౌతుంది. 16)దేశములో పర్యాటక ప్రదేశాల లో మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి. 17)కళా శాల విశ్వవిద్యాలయాల స్థాయిలో పర్యాటక శాస్త్రాన్ని పాఠ్యాంశంగా చేర్చి యువతకు ఉ



పాధి అవకాశాలు కలిగించాలి.

ఆధునిక టెక్నాలజీ,డిజిటల్ టెక్నాలజీ ని ఉపయోగించి స్వదేశీ విదేశీ .పర్యాటకులను విశేషంగా ఆకర్షించదానికి సమగ్రమైన పర్యాటక రంగ అభివృద్ధికి సమగ్రమైన అభివృధి వ్యూహాన్ని రూపొందించి సమగ్ర వృది కోసం పర్యాటకం అన్న థీమ్ అమలుకు తగిన కార్యాచరణ ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు రావాలి.



–నేదునూరి కనకయ్య
9440245771

## పార్వతమ్మ గారు తనువును చాలించారనే వార్త, మహతీ సేవా కుటీరంలోని ప్రతి హృదయాన్ని కలిసి వేసింది అనేది, అక్కడ ఉన్న ప్రతి ముఖచిత్రం తెలియజేస్తూనే ఉంది.

**కడసారిగా వారి పార్థీవ దేహానికి నివాళులు అర్పించేందుకు వందల సంఖ్యలో తరలి వస్తున్న జన సందోహంతో, పార్వతమ్మ గారు ఎంతో ప్రేమగా చూసుకునే "మహతీ సేవా కుటీరం"నిండిపోయింది.**

చెమర్చిన కన్నులతో కడసారిగా చూసిన ప్రతి ఒక్కరూ కన్నుల నిండుగా నీటిని నింపుకుని, శోకాన్ని దిగమింగుకుంటూ కదలిపోతున్నారు.

భాధపడని వారు ఎవ్వరైనా అక్కడ ఉన్నారా అంటే!, అది పార్వతమ్మ గారి పిల్లలు మాత్రమే.

గత కొంత కాలంగా తన వద్దే అట్టి పెట్టుకున్న ఆస్తి ఎవ్వరికి వ్రాసిందో?.అనేదే అక్కడ వారి మనస్సుల్లో చెక్కర్లు కొడుతున్నా మిలియన్ డాలర్లు ప్రశ్న.

ఎవ్వరికి వారే నటిస్తూ, జీవిస్తూ, తమ ప్రతిభను చాటుకుంటున్న పరిస్థితి నుండి అందరిని బయటకు తీసుకు రావాలని అనుకున్నాడో!,

లేక! తనకేమైనా ఆస్తిలో వాటా దక్కుతుందని ఆశ పడ్డాడో తెలియలేదుకానీ!.

పార్వతమ్మ గారి తమ్ముడు"ఏకనాధం" తొలిసారిగా నోరు విప్పాడు.

"మనమందరం ఏది జరగకూడదూ అనుకున్నామో ?

అదే జరిగి పోయిందని మీ అందరికీ తెలిసిన విషయమే.

అంతా దైవాదీనం.

మనం చేయగలిగింది ఏమీ లేదు?.

జనన మరణాలు సహజం

కానీ!ఇప్పుడు చేయవల్సిన కార్యక్రమాలు ఎలా జరిపించాలో అలోచించండి."

"కనీసం! తన పింఛన్ డబ్బులు ఎక్కడైనా దాచిందేమో,! ఏమైనా తెలిసిందా?" .

మీలో ఎవరికైనా చెప్పిందా "అంటున్న మేనమామ మాటలకు,

ప్రతి ఒక్కరూ ఎదుటివారిని అనుమానంగా చూసుకుంటూ

పార్వతమ్మ గారి సంతానం తలలు వంచేసారు,

ఏమీ తెలియదంటూ...

"చచ్చింది గొర్రే!.అనవసరంగా నోరు జారానా!" "అనుకున్నాడేమో? ఏకనాధం.

"సరే..సరే డబ్బు శాస్వతం కాదు,

మనం చేయవల్సిన కార్యక్రమాలు ఎదురు చూస్తున్నాయ్.

"ఇన్ని రోజులు వైద్యం కొసం , ఎవ్వరికి తోచినంత ఖర్చు చేస్తూ వచ్చాం. వాటి లెక్కా పత్రం లెక్కలు చూడండి,"

"చేయవల్సిన పనులు.కార్యక్రమాలు, ప్రతిదీ డబ్బుతోనే ముడిపడి ఉంది.

"తప్పదు కదా!, తలాకాస్త వాటా వేసుకుందాం,"

మేనమామ మాటలు, పూర్తి అవ్వకమునుపే!

ఈ మాట కోసమే ఎదురుచూస్తున్న పుత్రరత్నాలు .

జేబుల్లో భద్రంగా దాచుకున్నా లెక్కల కాయితాలు తీసి, టేబుల్ పైన ఉంచేసారు.

కూతురు కూడా తన తల్లితో సం చేసిన ఖర్చులు చిట్టా విప్పింది.

అమ్మకు ఖర్చు చేసిన ప్రతి పైసాకుడా లెక్కలను రాసి పెట్టిన పుత్ర రత్నాలను చూసిన పార్వతమ్మ గారి ఆత్మ నవ్వుకుంది....

మీకోసమే నా! ఈ తల్లి జీవితాంతం తల్లడిలింది అనుకుంటూనే...

××××××

కళ్ళు కాయలు కాసేలా పార్వతమ్మ గారి సంతానం ఎదురుచూస్తున్నా క్షణం, వారి ఇంటి ముంగిట్లో నిలిపింది.

"పోస్టు" అన్న కేక వినిపించడంతో, కాంప్లెక్సు లోని అన్నదమ్ములు తల తిప్పి చూశారు, పోస్టు మ్యాన్ వైపు.

ఈ క్షణం కోసమే ఎదురుచూస్తున్నారన్నది అక్కడ అందరి కంటే పోస్ట్ మ్యాన్ కు మాత్రమే ఎక్కువగా తెలుసు

ఎవ్వరు ఎదురు చూడకున్నా ప్రతి రోజు . తనకోసం ఎదురు చూసే ఆశాజీవులు వీరెనని.

"ఇక్కడ, ఫణి, రవి. తేజస్వి ఎవ్వరో వచ్చి సంతకాలు చేసి, ఈ రిజిస్ట్రార్ పోస్టులు తీసుకోండి."

అంటున్న పోస్టు మ్యాన్ దెగ్గిరకు పరుగున చేరుకుంటున్నారు ,తమకు వచ్చిన కవర్స్ అందుకునేందుకు

××××××

పార్వతమ్మ గారి పుత్రరత్నాల చేతుల్లో ఉన్నది పార్వతమ్మగారు వ్రాయించిన వీలునామా . . "

"తల్లిగా నా భాద్యతలను ఎన్నడూ విస్మరించింది లేదు,.

మీ ఎదుగుదలను కాంక్షించని క్షణం కూడా లేదు."

ఆలాగే! సమాజం కోసం ఏదో చేయాలనే నా చిన్ననాటి కోరికను మీకోసం దూరం చేసుకున్నది కూడా లేదు".

"తల్లిగా నా ఆలోచనల్లో మార్పు ఎన్నడూ రాలేదు.."

రేపటి సమాజం స్థితిగతులను అర్థం చేసుకుంటూ, మిమ్మల్ని ఉన్నత చదువులు చదివించాను.

## "వీలునామా" (కథ)

గొప్పింటి సంభందాలు కుదిర్చి పెళ్ళిల్లు జరిపించి మిమ్మల్ని ఓ ఇంటివాళ్ళను చేసాను.

అంతటితో నా భాద్యతలు తీరిపోయాయి అనుకోలేదు.

నా కష్టార్జితం,మీకు న్యాయబద్ధంగా చెందాల్సిన ఆస్తిని పంచేసాను."

నా జీవనాధారం కొనం కొంత అట్టిపెట్టుకున్నాను, అది కూడా మీ సమ్మతితోనే.

నా దగ్గర ఉన్న ఆస్తితో మీకు ఎటువంటి సంబంధం లేదు.

విలాసాలకు, నమాజంలోని మీగుర్తింపుకోసం "మీ జల్సాలకు, నేను పంచిన ఆస్తి మొత్తం ఖర్చు చేసుకుని, చివరకు అప్పుల్లో మునిగి పోయారు.

ఎక్కడా అప్పులు పుట్టని పరిస్థితుల్లో నా ఆస్తి కోసం నన్ను ఇబ్బంది పెట్టారు."

"అయిన నా బిడ్డలే కదా అనుకున్నాను, సర్దుకున్నాను. " పెద్ద మనసుతో మన్నించాను".

చివరకు నన్ను చంపాలి అనే ఆలోచన వరకు మీరు వెళ్ళాలనే ది వాస్తవం.

తల్లిగా మిమ్మల్ని క్షమించినా.

" కన్న ప్రేమతో మీ కష్టాలను చూస్తూ వేదనతో చిక్కి శల్యమై.. మీ ముందు జీవచ్ఛవంలా మిగిలిపోయా."

"నాకు తెలుసు బ్రతికి ఉండగా ఏరోజైనా ,ఏదైనా నేను చెప్పినా మీకు చాదస్తంగానే ఉంటుందని "

అందుకే! చివరి క్షణంలో నా మనస్సులోని సంఘర్షణ నుండి ఒక నిర్ణయానికి వచ్చేశాను.

" నా దగ్గర ఉన్న ఆస్తులు , ఏ అనాథ శరణాలయాలకో ఇచ్చేయాలని అనుకున్నాను"

చివరి నిమిషంలోనే చిన్న మార్పు చేయాలనుకున్నా !

ఎంతైనా నేను మీ కన్నతల్లిని కదా?

మమకారం వెన్నంటే ఉంటుందిలే.

అందుకేనేమో మీకు కాస్త ఉపయోగపడాలని ఇలా చేస్తున్నా!

"కన్న ప్రేమ కాదా! "

ఆస్థి మొత్తంతో ఒక గార్మెంట్స్ షాపు పెట్టాను.

అందులో, మీకు మూడు ఉద్యోగాలను కేటాయించాను."

"మీకు ఇష్టం ఉంటే చేయవచ్చును..

ఇందులో బలవంతం ఏమీ లేదులే.

కానీ! మీరు నెలసరి వర్కర్స్ లాగా మాత్రమే..

ఓనర్స్ ఎన్నటికీ కాదు.. "

"వ్యాపార పరంగా వస్తున్న ప్రతి పైసా అనాథ శరణాలయానికే చెందుతుంది.

మీకు ఇష్టం ఉంటేనే అక్కడ "జాన్ మార్టిన్ "ఉంటాడు.

వెళ్ళి కలవవచ్చు..

ఇదే నేను మీకు చేయగలిగే చివరి సహాయం "

"మీ అమ్మగా మీ క్షేమం కోరి నేను చేస్తున్న చివరి ప్రయత్నం..

మీకు నచ్చక పోయినా !

అవమానకరంగా భావిస్తున్నా..

ఈ అమ్మను అర్థం చేసుకునేందుకు ప్రయత్నం చేయండి

చేయలేక పోతారా !

అది మీలోని అవివేకానికి నిదర్శనంలా మిగిలిపోతుంది."

చివరి అవకాశం నిలుపుకుంటారో?

లేక చేజార్చుకుంటారో మీ ఇష్టం

అమ్మగా "మీరు జీవితంలో స్థిరపడాలని ,నేను చేస్తున్న ప్రయత్నంలో ఓడిపోతూనే ఉన్నాను. ."

నాకు గెలుపు ఓటములతో ఇంకా పనిలేదు.

"అర్థం చేసుకుంటారో, అహఃకారంతో దూరం చేసుకుంటారో మీ వ్యక్తిగతం.

బిడ్డలు ఉన్నతంగా ఎదగాలనే నా కల అసంపూర్ణంగా మింగింది.

చదువుతున్న ముగ్గురుకు కన్నీరు ఆగడం లేదు.

అమ్మ మనసు అర్థం అవుతుంటే...

ఇన్ని రోజులు అమ్మని ఎందుకు అర్థం చేసుకోలేక పోయాయో?అనే చిన్న ప్రశ్న వారి మనస్సులో ఎక్కడో పురుడు పోసుకుంటుంది.



–రాము కోలా
9849001201

## నా కలల భారతం

సర్వ మతాల సమ్మేళనం
వివిధ భాషలకు ఆలవాలం
సంస్కృతి సంప్రదాయాలకు
ఆదర్శం..
శాంతి సౌభ్రాబృతత్వానికి
సమైక్యతకు నిదర్శనం!

ప్రగతి పథం లో అగ్ర స్థానం
సాటి లేని మేటి రక్షణ రంగం
అంగ్లేయుల పాలనకు అడ్డు కట్టు వేసి
పోరాడి నిలబడి తెచ్చుకున్న స్వాతంత్రం..
ప్రపంచంలో కెల్లా అతి పెద్ద
ప్రజాస్వామ్య దేశం!

వేద శాస్త్రాలు వెలసిన దేశం
ఆయుర్వేదం పుట్టిన ప్రదేశం
జ్యోతిష్య, సంఖ్య శాస్త్రాలు
మొదటి స్థానం..
వేల విద్యాలయాలకు
జన్మ స్థలం
అన్నింటా ఆదర్శమయం!

నా భారతదేశం కావాలిక సదా..
వైద్య, విజ్ఞాన, శాస్త్ర సాంకేతికరంగాల
అభివృద్ధిలో ప్రథమస్థానం,
అన్నిరంగాల్లో అగ్రగామిగా
ప్రపంచంలోనే ఉండాలి మొదటి స్థానం..!
ఇదే నే కోరుకుంటున్న
ఇంకా నే కలలు కంటున్న
ఇదే..నా కలల భారతం..!!



–ఎన్.. రాజేష్
9849335757

## వందే భారతం

ఎవరన్నారు మన దేశంలో మేధావుల్లేరని
ప్రభుత మనసు పెట్టి వెతికితే
మట్టిలో మాణిక్యాలు దొరుకుతాయి..
ఎవరన్నారు సాంకేతిక పరిజ్ఞానం లేదని
ప్రభువు ఆర్థిక సాయమందిస్తే
కొత్త ఆవిష్కరణలు వెలుగుచూస్తాయి..
ఫలితం ఏమిటో తెలుసా?
పరాయి దేశాల ముందు చేయి చాచక్కర్లేదు
మనమే ఒకరికి ఆపన్నహస్తం అందించొచ్చు
కోవిడ్ మందుల సరఫరా విషయంలో
ఆనాడు అదే జరిగింది...
నేడు వందే భారత్ రైలు బోగీల తయారీతో
మన ఖజానాకు
భారీగా డబ్బు ఆదా అయింది!

–చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ

## తరతరాలకిలను దైవమైవెలిగేను

పూర్వజన్మకృతము పుణ్యఫలముగాను
పుణ్యవతిగ పుట్టె పుడమి లోన!
కర్మ మర్మ ధర్మ కర్తవ్యమునుదిద్దె
జగతి ప్రగతి కెపుడు సాక్షి భూతి!

చిట్టి పొట్టిగడుగు చీకాకు చిరునవ్వు
నత్తి మాటలొత్తి అత్త యనుచు!
పెరిగి పెద్దదగుచు ప్రీతిగా సేవతో
సోకు జేసె గుణము శోభమయము!

పుట్టినింటి కాంతి మెట్టినింటివెలుగు
వంశ కీర్తిపెంచు వసుధలోన!

తల్లిదండ్రికళ్ళ తావెల్గు జ్యోతిగా
ఇళ్ళలోన ప్రేమ జల్లునింపు!

కార్యమందు దాసి కరణేశు సచివుగా
రూపులోన లక్ష్మి చూపు మాత!
శయనమందు రంభ శాంతికే భూమాత
ఆరుకర్మలాత్మ ఆమెతృప్తి!

జగతి ప్రకృతిగాను జాగృతం నేర్పించు
మార్పుతీర్పుఓర్పు మానధనము!
త్రిగుణ శక్తి తాను శ్రీవాణిగిరిజా
లోక సౌఖ్యమెంచె లోకమాత!

భ్రూణహత్యమాని బుద్ధిగా మసిలితే
అంద చంద మంత ఆడపిల్ల
తరతరాలకిలను దైవమై వెలిగేను
భరతమాత తీరు భవ్యచరిత!.



–డా.పాండాల మహేశ్వర్,
9912180054

## ఇది నా తెలంగాణ

శాతవాహనుల కాలపు
శౌర్య పరక్రమభూమి.

కాకతీయ రాజుల
కళల కణాచి ఈనెల
విష్ణుకుండిన పలికిన
విశ్వగిరి ఈ పుడమి.

పువ్వులను పూజించే
పచ్చని సంస్కృతి
అలయి బాలయి అనే
అందమైన సంస్కృతి
బతుకు చిత్రం మార్చే
బంధు సంస్కృతి.

కమ్మని పాటల ఊట
జానపదుల పూదొట

భాగవతపు పోతున్నది
భక్తి నేర్పిన జాడ.

బతుకమ్మలను కొలిచేటి
బంగారు కాంతుల జానా
పీర్ల పండుగతో
చేరదీశే సంస్కృతి.

సమ్మక్క సారలమ్మ
సమైక్య సంస్కృతి
వీరులను కీర్తించే
దీరా సంస్కృతి.

ద్విపదను అందించిన
ఆదికవి పాల్కురికి
అచ్చ తెలుగు పలుకుల
అందమైన ఈ నేల

33 జిల్లాల
ముచ్చటైన తెలంగాణ
విభిన్న మతాల
వేద భూమి ఈనేల
కోటి కాంతుల జానా
నా తెలంగాణ
కోటి రతనాల వీణ.



–దేవులపల్లి రమేశ్,
9963701294

## ఆత్మీయతానురాగాలు

చిన్నా పెద్దా నీడలతో
సమయాన్ని కొలిచిన నాటి నుండి....
సమయం గుప్పిట్లో
మర బొమ్మలైన నేటి దాకా...

ఎన్నో అన్వేషణలు...
మరెన్నో ఆవిష్కరణలు!

అందవనుకున్నవన్నీ అందివస్తుంటే...
అందుబాటులోని వాటన్నింటినీ
దూరం చేసుకుంటూ...

గగన వీధుల్లోకి
రాకెట్లను పంపుతూ...
పొరుగువారితో
పోట్లాటకు దిగుతూ...

జీవితమంటే
గెలవడమొకటే కాదని గ్రహిస్తూ...

ఒక్క నిమిషం పరుగాపి
ఓటమిలోని మాధుర్యాన్ని అనుభవిస్తూ....

ఆత్మీయతానురాగాలను
పెనవేసుకుని ఆనందాలను
ఎద నింపుకో...!!



–వెగ్గలం ఉషఃశ్రీ
9440370066

# విదురనీతి శతకం

(సంస్కృత మహాభారతాంతర్గత విదురనీతి నుండి ఎన్నిక చేసిన శ్లోకాలకు తెనిగింపు.)



-హెచ్.ఆర్.చంద్రం
9493248053

మనసులోని మర్మమును, చేయబూనిన
పనిని పరుల కెరుక పరచకుండ
పూర్తిచేసి చూపు పురుషుండె ప్రాజ్ఞు డౌ
విశ్వ వినుత రీతి విదురనీతి

తాహ తెరిగి చేయ దలపెట్టు నెదియైన
మొదలుపెట్టె నేని పూర్తిచేయు
ఆపదు పని ప్రాజ్ఞు డాటంక మెదురైన
విశ్వ వినుత రీతి విదురనీతి

ఎదుటి వారు చెప్పునది లెస్సగ వినును
తలను దూర్చబో డితరుల పనుల
ప్రాజ్ఞు డైనవాని వర్తనం బిది కదా
విశ్వ వినుత రీతి విదురనీతి

తగనిదాని కొరకు తంటాలు పడబోడు
నష్ట వస్తువులకు కష్టపడడు
బెగడు పడడు సూ వివేకి ఆపద వేళ
విశ్వ వినుత రీతి విదురనీతి

మనసు నదపు నుంచి, మును మంచిచెడు లెంచి
మొదలుపెట్టు పనిని పూర్తిచేయు,
నట్టి కార్యశీలు డాదర్శవంతుడు
విశ్వ వినుత రీతి విదురనీతి

పొగడినపుడు పొంగిపోవక, అవమాన
పరచినపుడు దుఃఖపడక, లోతు
మడుగు వోలె కలతపడకుండు ప్రాజ్ఞుడు
విశ్వ వినుత రీతి విదురనీతి

జ్ఞానహీను డయ్యు గర్వించు, నిరుపేద
యయ్యు పొందగోరు నధిక సుఖము,
అల్పు డయ్యు మేలు లాశించు మూఢుడు
విశ్వ వినుత రీతి విదురనీతి

వదలి సొంత పనులు, పరవారి పనులలో
తలను దూర్చు, స్నేహితులను చెరచు
నట్టి వాడు మూర్ఖు డనబడు లోకాన
విశ్వ వినుత రీతి విదురనీతి

చేరదీయు తగని వారిని, తగు వారి
విడచివేయు, గొడవపడును తనను
మించువారి తోడ మిడిసి మూఢాత్ముడు
విశ్వ వినుత రీతి విదురనీతి

మిత్రుగా దలంచు శత్రుని, శత్రుగా
నెంచి మిత్రవరుని కించపరచు;
మూఢు డెపుడు చెడుకు మొగ్గుచూపుచు నుండు
విశ్వ వినుత రీతి విదురనీతి

అన్ని పనులయందు ఆలస్యమును, జంకు,
తనదు పనుల నొరుల కనుపు గుణము
పొసగు నిట్టి వెల్ల మూఢ లక్షణములై
విశ్వ వినుత రీతి విదురనీతి

పిలువకుండ బోవు పేరంటముల, కొరు
లడుగకుండ నుడువు నవియు నివియు,
నమ్మరాని వాని నమ్ము మూఢ నరుడు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఎవడు తప్పుచేసి ఇతరులపై ద్రోయు,
పరుల దిట్టు తనకు బలము లేమి,
తప్పకుండ మూఢతము డాత దగు గాక
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆస్తి యుండు గాక, అధికారమును నుండు
గాక, విద్య యుండు గాక, అవ్వి
గర్వ కారణములు కావు పండితునకు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆస్తిపాస్తు లున్న అనుభవించ దగును
ఆదరించుచుండి ఆశ్రితులను,
కాని యెడల వాడు కఠినాత్ము డనబడు
విశ్వ వినుత రీతి విదురనీతి

విడువబడిన మేటి విలుకాని బాణము
తగులవచ్చు, గురిని తప్పవచ్చు;
కాని నిష్ఫలమ్ము కాదు కోవిదు చేత
విశ్వ వినుత రీతి విదురనీతి

బాణ హతి నొకండు పడును, విష ప్రయో-
గమున నొకడు చచ్చుగాని, రాజ-
కీయ విప్లవమున క్షితి క్రిందు మీ దగు
విశ్వ వినుత రీతి విదురనీతి

క్షమను లోప మనుట సరికాదు, బల మద్ది;
వరము దుర్బలులకు; బలయుతులకు
వెలయు నదియ చూడ పెట్టని తెడ వౌచు
విశ్వ వినుత రీతి విదురనీతి

సహనపరుని జూచి జమకట్టు లోకము
చేతకాని వారి జాతిలోన;
కాని సహన మెపుడు కాబోదు లోపము
విశ్వ వినుత రీతి విదురనీతి

లేదు క్షమ కసాధ్య మేదియు లోకాన,
క్షమ జయించగలదు సర్వ జగతి;
శాంతి ఖడ్గధారి సరి జోదు లెవ్వరు?
విశ్వ వినుత రీతి విదురనీతి

దుష్ట వర్తనులకు దూరస్థ డగుటయు,
పరుష వాక్యములను పలుక కునికి
పురుషు నుత్తమునిగ పరిగణింపగ జేయు
విశ్వ వినుత రీతి విదురనీతి

చేయకుండ పనులు చెడును సంసారి, స-
న్యాసి చెడును ప్రతిది పూసికొనుచు;
కాని పనుల వలన రాణింపు కనరాదు
విశ్వ వినుత రీతి విదురనీతి

చెల్లియుండి యెవడు సైరించు, నర్థికి
బెట్టు కలుగు దాని ప్రేమతోడ,
నతడు పుణ్యపురుష డని పెద్దలందురు
విశ్వ వినుత రీతి విదురనీతి

న్యాయ మార్గమందు నార్జించు ద్రవ్య మ-
పాత్రులకు నొసంగి, పాత్రులకు నొ-
సంగ కున్న కీడు సంప్రాప్తమౌ రెంట
విశ్వ వినుత రీతి విదురనీతి

తప్పకుండ నుండు తర-తమ భేదాలు
మనుజులందు, వాని ననుసరించి
పనుల నప్పగింప ఫలితాలు బాగుండు
విశ్వ వినుత రీతి విదురనీతి

పరుల సొత్తు గొనుట, పర దారతో పొందు-
సేత, హితుని దవ్వ చేసికొనుట
నాశ కారకాలు నరున కీ మూడును
విశ్వ వినుత రీతి విదురనీతి

పనుల గలసి చేయు పంచేంద్రియమ్ములు,
అందు నొకటి ఛిద్రమైన, నరుడు
ఓటి పాత్ర వోలె నుండు నాపై నింక
విశ్వ వినుత రీతి విదురనీతి

దీర్ఘనిద్ర, తంద్ర,దీర్ఘ సూత్రత, క్రోధ,
మలసత, భయ మనెడి ఆరు దోష-
ములను విడువకున్న కలుగబో దభివృద్ధి
విశ్వ వినుత రీతి విదురనీతి
(తంద్ర=సోమరితనం; దీర్ఘసూత్రత=పనులు నిదానంగా చేయటం)

తగ్గుమొగము పట్టు తగ వెగదోయ, డ-
కార్యకర్త కాడు, కాడు గర్వి,
దైన్య మెరుగ-డతడె ధర నార్యశీలుడు
విశ్వ వినుత రీతి విదురనీతి

పొంగిపోడు స్వసుఖమునకు, పరుల దుఃఖ-
మునకు సంతసించబోడు, దాన
మొసగి వగవ-డతడె యొప్పు సత్పురుషుడై
విశ్వ వినుత రీతి విదురనీతి

నెరపు సములతోడ నెయ్యంబు, వియ్యంబు,
అనుగమించు సుగుణమణుల గూడి,
అందు సత్ఫలమ్ము లతని యత్నము లెల్ల
విశ్వ వినుత రీతి విదురనీతి

శ్రితుల కిడి భుజించు, మితము తిండియు నిద్ర,
అపరిమితము విధులయందు శ్రద్ధ,
అడిగెనేని శత్రువైన నిచ్చును జ్ఞాని
విశ్వ వినుత రీతి విదురనీతి

తాను మేలుసేయ దలచిన వారికి
అడుగకున్న, మంచిచెడుల వితము
విప్పి చెప్పదగును వివరించి తప్పక
విశ్వ వినుత రీతి విదురనీతి

కార్యసిద్ధి కొరకు కపట వర్తనమున
తమకు తగని దొడ్డిదారులందు
మనసు నిలుపబోరు మాన్యు లేనాడును
విశ్వ వినుత రీతి విదురనీతి

నేర్పుతోడ తాను నిర్వహించిన కార్య-
ములను కొన్ని యెడల ఫలము లీవు;
అంతమాత్ర నరుడు చింతింప పనిలేదు
విశ్వ వినుత రీతి విదురనీతి

కార్య మొకటి చేయగా బూనుకొను నప్పు
డానుపాను లరసి, ఆచి తూచి
ముందు కరుగ వలయు, తొందరపడ రాదు
విశ్వ వినుత రీతి విదురనీతి

ముసలితనము రూపమును చెరచిన భంగి
ఆస్తి దొలగజేయు నవినయమ్ము
కాన కలిమి కలుగ గర్వియై చనరాదు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఎరకు ఆసజెంది యెగబడి దిగమ్రింగు
చేప గాలమునకు చిక్కునటుల
లోభపడెడు వాని లోగొను కష్టాలు
విశ్వ వినుత రీతి విదురనీతి

అడ్డమైన గడ్డి నాశించి, యెగబడి
తినుట వెర్రితనము, తనకు హితము
గూర్చునట్టి దాని గొనుట యుక్తం బౌను
విశ్వ వినుత రీతి విదురనీతి

పసరు పిందె ద్రెంప రసమెట్లు సిద్ధించు?
విత్తనములు మొలక లెత్తబోవు;
అద నెరింగి చేయ నందు సత్ఫలములు
విశ్వ వినుత రీతి విదురనీతి

పూలు కందకుండ నే లీల తుమ్మెద
లానగలవౌ మధువు నట్లె ప్రభుత
ప్రజలు నొవ్వకుండ పన్ను గైకొన వలె
విశ్వ వినుత రీతి విదురనీతి

ఫలితముల గురించి బాగుగా తర్కించి
పనులు మొదలుపెట్టవలయు గాని
తగని వాని గూర్చి తలపెట్టనే రాదు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఎన్నటికిని ఫలిత మీయజాలని కార్య-
ములను నరుడు చేయబూన నేల?
వాని యత్న మెల్ల వ్యర్థమే యౌగాద!
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆసచేతు రెట్టు లసమర్థుని ప్రజలు
పాలకునిగ, తమకు నేలికగను?
షండు నెవతె కోరు పెండలియాడంగ?
విశ్వ వినుత రీతి విదురనీతి

యత్నమునకు మించి అధిక ఫలము నిచ్చు-
నట్టి పనులు ప్రాజ్ఞుడైన వాడు
కాలయాపనమ్ము కాకుండ మొదలిడు
విశ్వ వినుత రీతి విదురనీతి

మనసు-మాట-చూపు-పని ప్రసన్నము కాగ
పరుల నెవడు తృప్తిపరచ గలడొ
అట్టి వాని లోక మాదరించక యున్నె?
విశ్వ వినుత రీతి విదురనీతి

పరిగె యేరుకొనెడి పగిది సూక్తుల, సుకృ-
తముల సేకరించి తగ నట నట,
నరుడు ధీరు డగుచు నడుచుకోవలె గాక!
విశ్వ వినుత రీతి విదురనీతి

పరుల భోగ-భాగ్య-వంశ-రూపాదుల
చూడలేక యెవ డసూయపడునొ
వాడు మాయరోగ పీడితుడౌ సదా!
విశ్వ వినుత రీతి విదురనీతి

ధనము-విద్య-వంశ ఘనత దుర్జనుల క-
హమ్ము బెంచు, నవియె అడకువయును
వినయ వర్తనమ్ము పెంచు సజ్జనులకు
విశ్వ వినుత రీతి విదురనీతి

శీలమే ప్రధాన మీ లోకమందున,
ధనము గాని, బంధు జనము గాని
శీల హీనునకును మేలు గూర్చగ లేవు
విశ్వ వినుత రీతి విదురనీతి

కడుపు కాలు వాడు కుడిచి సంతృప్తుడౌ,
నాకలి రుచి పెంచు నన్నమునకు;
నిట్టి యనుభవమ్ము నెరుగరు కలవారు
విశ్వ వినుత రీతి విదురనీతి

కడుపు నిండ తినిన కలవారి కరుగదు
పేద కరిగిపోవు నేది తినిన
ఈ ప్రపంచమందు నివి రెండు వింతలు!
విశ్వ వినుత రీతి విదురనీతి

బ్రతుకు తెరువు లేమి భయపెట్టు నధముల
మరణ మన్న భయము మధ్యములకు
అవని నుత్తములకు నవమాన భయ మెచ్చు
విశ్వ వినుత రీతి విదురనీతి

అగును రథము దేహ, మశ్వమ్ము లింద్రియ-
మ్ములు, నియంత మనసు పురుషునకును;
అప్రమత్త రథికుడై ధీరుడు చెలంగు
విశ్వ వినుత రీతి విదురనీతి

అర్థయుక్తముగను, ఆకట్టుకొనునట్లు
పల్కు టెవరి తరము బహు సమయము?
ఆచి తూచి పల్కు టత్యంత కష్టము!
విశ్వ వినుత రీతి విదురనీతి

మాట మంచితనము మన్నన గల్పించు
నోటి దురుసుతనము చేటు దెచ్చు
మాట జారెనేని మరలింప శక్యమా?
విశ్వ వినుత రీతి విదురనీతి

మేన గుచ్చుకొన్న బాణాల నెటులైన
పెరుకవచ్చు గాని, పెరుక తరమె
మదిని నాటుకొన్న మాటల ఈటెలు?
విశ్వ వినుత రీతి విదురనీతి

చేటు కాలమందు చెడు మాటలే నచ్చు
ననుచితంపు పనుల మనసు మెచ్చు
తప్పు లెల్ల తనకు నొప్పులై కనిపించు
విశ్వ వినుత రీతి విదురనీతి

సర్వ తీర్థములను స్నానమాడుటయును
సర్వభూత సమత సమము లైన
భూతసమత వైపె మొగ్గుచూపును ముల్లు
విశ్వ వినుత రీతి విదురనీతి

కీర్తి యెంతవరకు గుర్తింపబడుచుండు
నంత వరకు నాత డమరు డగును
కీర్తికాయమునకు కీడు వాటిల్లదు
విశ్వ వినుత రీతి విదురనీతి

సందియమ్ము లేదు, సంకల్పమును బట్టి
కార్యసిద్ధి పొందగలడు నరుడు;
మంచి కోరుకొనుట మానవ ధర్మము
విశ్వ వినుత రీతి విదురనీతి

సత్ప్రవర్తనమ్ము సంప దీయగ, వృద్ధి
చేయు ప్రతిభ, రక్ష సేయు నేర్పు,
నిగ్రహమ్ము దాని నిలదొక్కకొన జేయు
విశ్వ వినుత రీతి విదురనీతి

రేయి కొరకు పవలు, రేపు కోసము మాపు,
వార్ధకమ్ము గూర్చి వయసునందె
జాగు లేక నరుడు జాగ్రత్త పడవలె
విశ్వ వినుత రీతి విదురనీతి

రుషుల, నదుల, వర పురుషుల పుట్టుకలకు
మూల మెవ్వ డెరుగజాలు? నెరుగ
గోరు గాని, తెలుసుకొను వాడు కనరాడు!
విశ్వ వినుత రీతి విదురనీతి

పండితుండు, శూరవరుడు, సేవాధర్మ
మెరిగియున్న యట్టి నరుడు భువిని
సత్ఫలమ్ము లంది సంతుష్టు లగుదురు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఒకరి వెంటనంటి యున్నవా డతనికి
వశ్య డగుట వింత వార్త కాదు;
కాన సజ్జనులనె తా నెన్నుకోవలె
విశ్వ వినుత రీతి విదురనీతి

సర్వజన హితుండు, సత్యవాదియు, దాంతు
డెపుడు కోర దశుభ మెవ్వరికిని;
ఒరుల నొవ్వబలుక డుత్తమ పురుషుడు
విశ్వ వినుత రీతి విదురనీతి

ప్రాకులాడబోడు పనికిమాలిన దాని,
కొరుల లోటుపాటు లెరుగగలడు;
మాట తప్పకుండు మధ్యమ పురుషుడు
విశ్వ వినుత రీతి విదురనీతి

తనను తానె నమ్మ, దనుభవజ్ఞులు చెప్పు
మంచియైన విని గ్రహించబోడు;
ఆప్త వాక్యములను ఆలించ దధముడు
విశ్వ వినుత రీతి విదురనీతి

చేరి ఉత్తములనె సేవించవలె, తప్ప-
నపుడు మధ్యములను, అంతె గాని
అధము గొల్వగూడ దవసర మెంతున్న
విశ్వ వినుత రీతి విదురనీతి

చదువు సంపదలును,సత్ప్రవర్తన గల్గు
పురుషు లున్న కులము పొల్పుమీరు;
గుణము లేనిచోట కుల మెన్నికకు రాదు
విశ్వ వినుత రీతి విదురనీతి

ధనవిహీను లయ్యు గుణవంతు లైనచో
వారి వంశమునకు పేరు వచ్చు,
గౌరవమ్ము హెచ్చు, ఘనకీర్తి గనవచ్చు
విశ్వ వినుత రీతి విదురనీతి

ధనము వచ్చు-పోవు, ధనహీను డల్పుడే?
వృత్త హీను డగును మృతసముండు;
కాన నడవడికను కాపాడుకొనవలె
విశ్వ వినుత రీతి విదురనీతి

ప్రాణమిత్రు డైన, బంధువు కాకున్న
బంధుసము డనంగ వచ్చు నతని;
అతడె హితుడు, తగు సహాయకుడును గూడ
విశ్వ వినుత రీతి విదురనీతి

గాలివాటు బట్టి కదలు మేఘ మ్మట్లు
నిలుక డెరుగబోదు ఖలుని బుద్ధి;
ఎవ్వ డెరుగు నద్ది యెపు డెట్లు లుండునో?
విశ్వ వినుత రీతి విదురనీతి

వగపు వలన తరుగు బలము, రూపము చెడు,
వగచిన మతి తప్పు, వచ్చు తెగులు;
వగ పనర్థకరము, తగ దది నరులకు
విశ్వ వినుత రీతి విదురనీతి

భయము తొలగు బుద్ధిబలముచే, గురు సేవ
జ్ఞాన మిచ్చు, తపము ఘనత బెంచు,
శాంతి నొసగు ధ్యానసంస్థితి నరునకు
విశ్వ వినుత రీతి విదురనీతి

ప్రియము పలుకువారు వేవేలు లోకాన,
కాని, అరుదు మేలు గలుగజేయు
నప్రియంపు మాట అనువారు వినువారు
విశ్వ వినుత రీతి విదురనీతి

కులము కొరకు నొకని, కుల మూరికై, దేశ
భద్రతకును నూరు వదలవచ్చు;
స్వీయరక్షకై త్యజించవ చ్చెదియైన!
విశ్వ వినుత రీతి విదురనీతి

తెలియ వచ్చుచుండె తొలినాళ్ల నుండియు
ద్యూతకర్మ వైర(పాప)హేతు వనుచు,
గాన వేడుకకును గనగూడ దటువైపు
విశ్వ వినుత రీతి విదురనీతి

భృత్యు లనవరతము విశ్వాసపాత్రులై
తనను భక్తి గొలువ, తాను వారి
నాదరించుచుండి ఆకట్టుకొనవలె
విశ్వ వినుత రీతి విదురనీతి

దుష్టు డితరులందు దోషాలె వెదకును,
గుణము లరయ; దుత్తమునకు పరుల-
లోని మంచి, స్వీయ లోపాలు కనిపించు
విశ్వ వినుత రీతి విదురనీతి

గౌరవించ దగిన వారు స్త్రీ, లిండ్లకు
వెలుగు నిచ్చు దీపములును, సిరులు;
వారి మహిమ లెరిగి వర్తించవలె గాద!
విశ్వ వినుత రీతి విదురనీతి

సమయమునకు తగని సంభాషణము మెప్పు
పొందబోదు, పరువుపోవు గాని;
వక్త(వ్యక్తి) గొప్పదనము పనిచేయ దక్కడ!
విశ్వ వినుత రీతి విదురనీతి

గుణము వలన నొకడు, ధనముచే నొక్కడు
గొప్పవా రగుదురు; గుణము లేని
ధనము గలుగువాని కొనియాడ పనిలేదు
విశ్వ వినుత రీతి విదురనీతి

సజ్జనుండు, వినయ సంపన్ను డితరుల
కెట్టి పీడ కలుగు టిష్టపడదు;
పీడ స్వల్పమును ఉపేక్ష చేయగలేడు
విశ్వ వినుత రీతి విదురనీతి

పరుల నిందజేసి పరితుష్టు లగువారు
పరుల దుఃఖపెట్టు పనుల కొరకు,
తగవు లొదవజేయ తపియించు చుందురు
విశ్వ వినుత రీతి విదురనీతి

జరిగెనేని చిన్ని పొరపాటు తనపట్ల
ఓపి నీచు దూరకుండ, దట్టి
వానితోడి పొందు వర్జించవలె వేగ
విశ్వ వినుత రీతి విదురనీతి

పేదవాని, రోగ పీడితు, దీనుని
ఆదరించ వలయు నయినవారు;
అపుడె వారి వృద్ధి నాసింతు రందరు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆశ్రయించి ధనికుడైన జ్ఞాతిని, మోస-
గించి, కడకు వాని ముంచు వాని
పోల్చవలయు విషము పూసిన ములికితో
విశ్వ వినుత రీతి విదురనీతి

మరణశయ్య పైన పరితపించగ జేయు
పనుల నెరిగి మానుకొనుట లెస్స;
జగతి జీవితము అశాశ్వతమే కదా!
విశ్వ వినుత రీతి విదురనీతి

తప్పు జరుగకుండ తప్పించుకొన గల్గు
టెవరి తరము? తప్పు నెరిగి, ఉచిత-
రీతి మసలుకొనుట నీతిమంతుల పని
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆకాశానికి
వెలుతురు మెట్లు
బహుళ అంతస్తులది
బడాయి



వేదికపై
ఏకపత్నీవ్రతుడు
జీవితం
బహు కళత్ర క్రతువు



చిన్నప్పటి
పంతులు గుర్తొచ్చాడు
చేతులు మొట్టికాయల్ని
తడుముకున్నాయి



-సోమేపల్లి వెంకటసుబ్బయ్య
9000004565

పెద్దవారు చెప్పు సుద్దుల నాలించి
మంచిచెడుల నెల్ల మది దలంచి
ఆచరించువాని కందు సత్ఫలములు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆచరించువార లసమర్థు లైనను,
చాలినంత గ్రహణశక్తి లేమి
నిరుపయోగ మగును గరపిన హితబోధ
విశ్వ వినుత రీతి విదురనీతి

పాప పంకమందు పడి కూరుకొనిపోయి
అందె పొరలుచుండు మందబుద్ధి,
పాపకర్మ మాని వర్ధిల్లు గుణశాలి
విశ్వ వినుత రీతి విదురనీతి

శాస్త్ర మెరుగకుండ, సద్గురు కృప పొంద-
కుండ, నొకడు బుద్ధికుశలు డయ్యు,
ధర్మసూక్ష్మ మరయ దక్షుడు కాలేడు
విశ్వ వినుత రీతి విదురనీతి

కడలి బడిన దినుసు, ఖలునకు హితబోధ,
ఆత్మదృష్టి లేనియట్టి విద్య,
అగ్ని బడని హుతము వ్యర్థముల్ గావెట్లు?
విశ్వ వినుత రీతి విదురనీతి

పుట్టి పెరుగు చోటు, భోజన భోగాలు,
వస్త్ర ధారణమ్ము, వర్తనమ్ము
బట్టి తెలియవచ్చు వంశ మర్యాదలు
విశ్వ వినుత రీతి విదురనీతి

కామ్యవస్తు వొకటి కంటిలో బడిన ని-
స్సంగునకును మనసు సంచలించు
ననిన భోగలాలసుని గూర్చి అననేల?
విశ్వ వినుత రీతి విదురనీతి

మనసులు కలసి అరమరికలు లేకుండ,
శక్తి-యుక్తులందు సామ్య ముండు
నట్టివారి మైత్రి కెట్టి ఆపద రాదు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఇంద్రియముల నిగ్రహించుట కష్టమౌ,
నైన, నదపు దప్పిరేని, వార
లెంతవార లైన చింతలు తప్పవు
విశ్వ వినుత రీతి విదురనీతి

పాత తప్పిదములు, వర్తమాన స్థితి,
మీదు కాలగతి సమీక్ష చేసి
నడుచుకొన్న వాడు నష్టపో డేనాడు
విశ్వ వినుత రీతి విదురనీతి

మనసు-మాట-చేత మనిషి కెద్దానిపై
లగ్న మగునొ, అదియె లాగు నతని;
కాన మంచి యొకటె కాంక్షించవలె నెప్డు
విశ్వ వినుత రీతి విదురనీతి

నిత్య యత్నరతుడు, నిర్వేద రహితుడు
శుభ ఫలాల నందు, సుఖము నొందు;
యత్నపరు డొకండె అభివృద్ధి గాంచును
విశ్వ వినుత రీతి విదురనీతి

క్షమ వహించ దగు నశక్తుడు సర్వత్ర,
ఉచిత మెరిగి శక్తు డోర్వ వలయు;
క్షమయె శ్రేష్ఠ మగును సమదృష్టులకు నెందు
విశ్వ వినుత రీతి విదురనీతి

అనుభవించ వచ్చు మనుజుడు సుఖముల
ధర్మ మార్గ మెపుడు దప్పకుండ;
పరుల మెప్పు కొరకు వలదు వ్రతాదులు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆర్జవమ్ము గలిగి, అణకువగా నుండు
వాని చేతకాని వాడటంచు
అలుసుచేసి దుష్టు లదలించు చుందురు
విశ్వ వినుత రీతి విదురనీతి

తనకు నచ్చనట్టి పని యొరులకు జేయ-
కునికి పరమధర్మ మనగ బరగు;
ధర్మ మన్య మొండు ధరణిలో గనరాదు
విశ్వ వినుత రీతి విదురనీతి

తృప్తిపరచ జాల వీ భువి నున్న సం-
పదలు సర్వ మొక్క మనిషి నైన!
ఆశ లుడుగ రెట్టు లది యెరింగిన వారు?
విశ్వ వినుత రీతి విదురనీతి

సుఖము కొరకు విద్య, సుఖము విద్య కొరకు
వదల వలయు; రెండు కుదురబోవు;
వీడకున్న సుఖము కాడు సద్విద్యార్థి
విశ్వ వినుత రీతి విదురనీతి

పొందలేరు శోకమున కోరుకొన్నది,
ఒడలు చెడును, తృప్తినొందు వైరి;
కాన శోక ముడుపగా నొప్పు నేరికి
విశ్వ వినుత రీతి విదురనీతి

ఎట్టులైన కూడబెట్టవచ్చు ధనము,
సాధ్యపడదు శీలసంప దట్లు;
ధనము శీలమునకు తగదు పోలిక చెప్ప
విశ్వ వినుత రీతి విదురనీతి

నిమిషమైన బుద్ధి నిలుకడ లేకుండ
సంచరించునట్టి చపలచిత్తు
నాప్త మిత్రులైన అంటి యుండగలేరు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆస్తిపరుడు మరియు ఆరోగ్యవంతుడై
యున్నవాని కన్న మిన్న యెవడు?
ఎంచ దీర్ఘరోగి మృతకల్పుడే కదా!
విశ్వ వినుత రీతి విదురనీతి

గరువపోతుతనము, దురభిమానము, నుబ్బు,
సిగ్గుమాలి యునికి, అగ్గలంపు
కోప మున్నవాడు గుణవంతు డగు నెట్లు?
విశ్వ వినుత రీతి విదురనీతి

ధర్మనిరతి చేత దక్కు శ్రేయ, మహింస
వలని సుఖము, నోర్మికలిమి శాంతి,
చదు వొసంగు తృప్తి సాటిలేనివి సుమ్ము
విశ్వ వినుత రీతి విదురనీతి

పైతృకముగ నందివచ్చిన సంపద
ఖలుని చెంత చిరము నిలుచు నెట్లు?
చెదిరిపోదె ఘనము చెలరేగ పెనుగాలి?
విశ్వ వినుత రీతి విదురనీతి

బాలుడైన, పిచ్చివాడైన-పల్కిన
మంచిమాట స్వీకరించ దగును;
మట్టిలోన దొరకు మాణిక్యములు గాద!
విశ్వ వినుత రీతి విదురనీతి

సుమతి ఆదుకొనును సుమతి నక్కరలందు,
ఆదుకొనును కుమతినైన సుమతి;
కుమతి యెన్న డాదుకొనబోడు సుమతిని
విశ్వ వినుత రీతి విదురనీతి

తన మనస్సె శత్రు వని యెంచుకొనువాడు
మొదట దాని గెలువ బూను, పిదప
బాహ్యశత్రుగణము పైబడి సాధించు
విశ్వ వినుత రీతి విదురనీతి

అలవికాని అశ్వములు సారథిని ద్రోయు
భంగి నిగ్రహింపబడని మనసు,
నింద్రియములు నరుని నిబ్బందులను ముంచు
విశ్వ వినుత రీతి విదురనీతి

అగును గాక పురుష డైశ్వర్యవంతుడు,
ఇంద్రియముల నిగ్రహింపడేని
అతడు నష్టపోవు నైశ్వర్య మద్దాన
విశ్వ వినుత రీతి విదురనీతి

బయట కురుకు ఝషము వల కళ్లు కొరికి, కా-
మంబు క్రోధ మటులె మాయచేసి
జనుల చెరచు క్షణ మజాగ్రత్తగా నున్న!
విశ్వ వినుత రీతి విదురనీతి

పాప మెరుగకున్న, పాపుల గూడిన
పాప ఫలము లంటు;పచ్చగడ్డి
యెండుగడ్డి గలసి యుండిన దగ్ధమౌ!
విశ్వ వినుత రీతి విదురనీతి

సూటిపోటి మాట లీటెలై యెద నాట
నంతులేని దుఃఖ మావహిల్లు;
కనుక నట్టి మాట లనగూడ దితరుల
విశ్వ వినుత రీతి విదురనీతి

న్యాయ-ధర్మ నిరతులౌ పెద్ద లున్నట్టి
సభలె సభలు, మంచి జరుగు నందు;
ఛలము గలుగు చోట సత్య మదృశ్యమౌ
విశ్వ వినుత రీతి విదురనీతి

సుకృత నిరతి బుద్ధి వికసింపజేయును,
బుద్ధి కుశలుడైన పుణ్యశీలి
ధర్మమార్గ మెట్లు తప్పిపోజాలును?
విశ్వ వినుత రీతి విదురనీతి

దాచలేదు సూ అధర్మ సంపాదన
దోషముల చిరంబు, తొలగజేయు
పొందియున్న పూర్వ పుణ్యఫలములను
విశ్వ వినుత రీతి విదురనీతి

సజ్జనులను గురులు శాసించ గలరు, దు-
ర్జనుల నణచు రాజ శాసనములు,
భంగపరుచు యముడు ప్రచ్ఛన్న పాపుల
విశ్వ వినుత రీతి విదురనీతి

ఎదిరి నడతబట్టి బదులీయ దగు, మోస-
గాళ్ల, సజ్జనులను గని, గణించి
వారి వారి పట్ల వర్తించవలె నట్లె
విశ్వ వినుత రీతి విదురనీతి

అప్రియమ్ము-ప్రియము ననకుండ, మేల్సేయు
నట్టి మాట లప్రియమ్ము లైన
మానకుండ జెప్పు మాన్యుడౌ హితకారి
విశ్వ వినుత రీతి విదురనీతి

ఆజ్ఞ సరకుగొనక, యజమాని నెదిరించి,
వాదులాడి, తనదు ప్రతిభ జూప
నెంచు సేవకుని భరించజాలు నెవడు?
విశ్వ వినుత రీతి విదురనీతి

కాల్చి బూదిసేయ గల్గు తేజశ్శక్తి
యున్న నిప్పు. కట్టె నుండు నణగి;
రెచ్చగొట్ట ప్రజ్వరిల్లి నాల్కలు సాచు
విశ్వ వినుత రీతి విదురనీతి

ఎగ్గుసేయు వాని కే రీతిగానైన
బుద్ధిచెప్ప గలడు బుద్ధిశాలి;
అట్టివారి జోలి కరుగకుండుట లెస్స
విశ్వ వినుత రీతి విదురనీతి

శ్రేష్ఠకర్మ లాచరించి శుభఫలము
లందవచ్చు, వాని నాచరించ
కుందురేని తుదిని కుందక తప్పదు
విశ్వ వినుత రీతి విదురనీతి

కావు కారణములు కలిమి-లేములకు బు-
ద్ధి కుశలతయు, జడత; ధీరు డెరుగు
దేశ-కాల గతుల, తెలియలే డజ్ఞుడు
విశ్వ వినుత రీతి విదురనీతి

కలుగ దానగుణము, కట్టుబాట్లను గౌర-
వించు నడత, మాట మంచితనము
నెల్లవార లతని నెట్లు మెచ్చక యుంద్రు?
విశ్వ వినుత రీతి విదురనీతి

తనకు మేలుసేయ దక్షులౌ మాన్యుల
మంచినే సతతము నెంచుచుండి
దేవతలుగ వారి సేవించుకొన వలె
విశ్వ వినుత రీతి విదురనీతి

అక్కరలకు వచ్చి ఆదుకొంద్రు పరోప-
కార గుణము గలుగు వార, లట్లు
కాక పనుల జెరచు కాలహర్తలు నుంద్రు
విశ్వ వినుత రీతి విదురనీతి

స్తోత్ర పాఠకుండు, జూదరి, వెలయాలు
పొగడుచుందు రెవని నగణితముగ,
నట్టివాడు మాన్యు డగుట సందేహమే!
విశ్వ వినుత రీతి విదురనీతి

సుగుణవంతు డయ్యు వెగటు పుట్టించును
నచ్చనట్టి వాడు, నచ్చు వాడు
గుణము లెట్టు లున్న కొనియాడబడు నెప్డు
విశ్వ వినుత రీతి విదురనీతి

ప్రీతితోడి పలుకరింపులు, సహపంక్తి
భోజనములు బంధువులకు తగును;
వైరగుణము వల్ల బంధుత్వములు చెడు
విశ్వ వినుత రీతి విదురనీతి

మంచి చేయగలరు, ముంచివేయ గలరు
జ్ఞాతు లెల్ల రొక్క రీతి గాదు;
వ్యక్తిగతములై ప్రవర్తనల్ వర్తిల్లు
విశ్వ వినుత రీతి విదురనీతి

కట్టెలందు బెట్టి కాల్చిన పురుషుని
వెంబడించు విడక స్వీయకర్మ;
కాన ధర్మనిరతి కలిగియుండుట లెస్స
విశ్వ వినుత రీతి విదురనీతి

వయసు-శీల-మనుభవము గల్గు శ్రేయోభి-
లాషితోడ నవసరములయందు
సంప్రదించు నెడల సత్ఫలములు దక్కు
విశ్వ వినుత రీతి విదురనీతి

మన సెరింగి మసలుకొనువాడు, హితవరి,
ఓర్పు-నేర్పు-సుగుణ ముండి, బుద్ధి-
కుశలుడైన సేవకుడు దుర్లభుడు గదా!
విశ్వ వినుత రీతి విదురనీతి

బ్రతుకు తెరువు చూపవలె పుత్రులకు, పుత్రి-
కలకు తగిన వరుల కట్టబెట్ట-
వలయు; నివ్వి బాధ్యతలు కన్నవారికి
విశ్వ వినుత రీతి విదురనీతి

తగవుబెట్టుకొన్న తనను మించిన వాని
తోడ, మిన్నకుండబోడు వాడు;
చావుదెబ్బ కొట్టు జాగ్రత్తపడ కున్న
విశ్వ వినుత రీతి విదురనీతి

పుట్టు కెట్టిదైన, బుద్ధి బాగున్నచో
వాని మించు గొప్పవాడు లేడు;
కులము గొప్ప కాదు, గుణమే ప్రధానము
విశ్వ వినుత రీతి విదురనీతి

అతిశయించెనేని వ్రత-శౌర్య-ప్ర-జ్ఞాభి
మాన-దాన విధులు, మంచితనము
భయముజెంది లక్ష్మి పరుగిడు నటనుండి
విశ్వ వినుత రీతి విదురనీతి

బ్రతు కశాశ్వతమ్ము! రాజులు, భోగులు,
ఆత్మతత్త్వవేదు, లమిత బలులు
అన్ని విడిచిపోదు రవసానమున చచ్చి
విశ్వ వినుత రీతి విదురనీతి

# మన తెలుగు చరిత్ర కొండంత తెలిసింది గోరంత

ప్రతి మనిషి మొదటగా జన్మనిచ్చిన అమ్మ గురించి ,మాట నేర్చిన అమ్మనుడి గురించి తెలుసుకోవలసిన బాధ్యత ఎంతో ఉంది.అమ్మ గురించి చెప్పాలంటే, అమ్మ మమతానురాగాలు చవి చూడాలి. అమ్మనుడి గురించి చెప్పాలంటే ,ఆ మాతృభాషా సౌందర్యాన్ని, దాని గొప్పదనాన్ని ,ఆ నుడి లోని సాహిత్య సంపద గురించి తెలుసుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 18 కోట్ల తెలుగు వారి భాష తెలుగు. మనదేశంలో హిందీ తర్వాత ఎక్కువగా మాట్లాడే రెండవ భాష మన తెలుగే . ఈ మధ్యన బ్యాంకాగ్ లోజరిగిన అంతర్జాతీయ లిపుల సదస్సులో కొరియా భాష తర్వాత రెండవ అంతర్జాతీయ లిపిగా తెలుగునే సమర్ధించారు. అంత చక్కని అజంత భాష .అమర భావాల అమృత భాష .మన తెలుగు నుడి.

ఇక తెలుగు నుడి చరిత్ర గురించి చెప్పుకుంటే ,ఇది క్రీస్తుకు ముందు దాదాపు 3000 సంవత్సరాల క్రితమే తొలి అడుగులు వేసిన ద్రావిడ భాష తెలుగు అని చెప్పవచ్చు .అంటే ఆదిమ ద్రావిడ భాషల చరిత్ర క్రీస్తుపూర్వమే కొన్ని శతాబ్దాల ముందు ఉన్నది. ప్రపంచంలో అన్ని భాషల కన్నా పాత భాషగా పాత సుమేర్ భాషను ఎక్కువమంది అంగీకరించారు .తరువాత పాత ఈజిప్టు ,హిబ్రూ, గ్రీకు ,పాతచైనా, కొరియా భాషలు పాతవిగా గుర్తించారు .మన తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది . సంస్కృతం, ఉర్దూ ,ఇంగ్లీషు ,ఫ్రెంచ్ భాషలు ఇండో ఆర్యన్ భాషాకుటుంబానికి చెందినవి .అంటే ఇండో యూరప్ కుటుంబానికి చెందినవి. మరి మన ద్రావిడ భాషలైన తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, తులు,కొడగు,కుడుక్, గోండి , గదబ, ద్రావిడ భాష కుటుంబానికి చెందినవి. ఇక కొందరున్నట్లుగా జనని సంస్కృతంబు సకల భాషలకు అన్న మాటతప్పని ఎందరో సాహితీ వేత్తల వాదన. నిజమే .మన తెలుగు, ఇతర ద్రావిడ భాషలకు, సంస్కృతానికి సంబంధమే లేదంటారు .ఇక ఇతర భాషలు చూస్తే హిందీ సంస్కృతం, ప్రాకృతం, ఉర్దూ, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, గుజరాతి ,ఒరియా, మరాఠీ, కాశ్మీరీ, కొంకిని, నేపాలి , ఈ భాషలన్నీ ఇండో ఆర్యన్ భాష కుటుంబానికి చెందినవి. ద్రావిడ భాషల్లో మొదటగా విడివడిన భాష తెలుగు. తెలుగు తర్వాత తమిళం కన్నడం మలయాళం విడిపోయాయి. ప్రపంచంలో దాదాపు 6000 భాషలు ఉన్నాయి. వాటిలో సొంత లిపి కలిగి ఉన్న భాషలు దాదాపు 400 లోపు. అసలు హిందీ సంస్కృతం ,మరాఠీలకు సొంత లిపులు లేవు. అవి దేవ నగరి లిపిని వాడుకుంటున్నాయి. భారతీయ భాషా కుటుంబాల్లో ముఖ్యమైనవి రెండు భాషా కుటుంబాలు. ఒకటి ఇండో ఆర్యన్ భాష కుటుంబం రెండవది ద్రావిడ భాషా కుటుంబం .ఇండో ఆర్యన్ భాషలకు చెందినవి ఉత్తర భారతీయ భాషలు .వాటిని ఉత్తర భారతీయ ఆర్య భాషలని కూడా అంటారు .ద్రవిడ కుటుంబానికి చెందిన భాషలు దక్షిణ భారతీయ భాషలు వీటిని ద్రావిడ భాషలు అంటారు.

అలాగే ప్రపంచంలో ఉన్న భాషలలో ఎక్కువ ధాతువులు (తీనీనీబిబ నీట లవతీఎబ,) ఉన్న భాష మన తెలుగే. క్రియాధాతువులు తమిళానికి 450, హిందీకి 350, సంస్కృతానికి 1400 ,మరి మన తెలుగుకి ఎన్నో తెలుసా! 1800 ధాతువులు ఉన్నాయి. అంత గొప్ప భాష మనది . ధాతుక్రియలు అంటే కోయు, మూయు, వ్రాయు, వచ్చు, పోవు,కూరు, వండు,నేయు,తెచ్చు, ఇచ్చు....ఇలా.. ఉదాహరణకు చేయు అనే మూలక్రియనే తీసుకుంటే ఆ మూల ధాతువు నుండి ఎన్ని పదాలు పుట్టించవచ్చునో తెలుసా! అవి ,చేత ,చేనేత ,చేయగల ,చేసి ,చేసిన, చేయుచున్న ,చేసినట్టు, చేయలేని, చేసుకున్న, చేసుకుపోతున్న,చేస్తూ, చేస్తూ ఉన్న, చేయలేక, చేతకాక, చేతనైన,....ఇలా వేల పదాలు పుట్టించుకోవచ్చు, ఈ సౌలభ్యం ఇంతగా ఇతర నుడులలో లేదు.

అలాగే మన తెలుగు అజంత భాష. అంటే ప్రతి పదము చివర అచ్చు ఉచ్చారణతో మాట అంతమవుతుంది అందుకే అజంత అన్నారు. ఉదాహరణకు ...తమిళంలో నింగల్, ఊంజల్, పెరుమాళ్ చివరి అక్షరాలు హల్లు వుచ్చారణ ఉంటాయి. అలాగే ఇంగ్లీషు తీసుకుంటే మదర్ ,వాటర్, పెన్ , టెన్,చివర అక్షరాలు వుచ్చారణ హల్లుతో ఉంటుంది .అలాగే హిందీ తీసుకుంటే ..జంగల్ ,పాగల్, జమీన్ చివరక్షరాలు హల్లు ఉంటాయి .మరి మన తెలుగు మాటల చివర అచ్చు ఉచ్చారణ ఉంటుంది. మచ్చుకు అందరూ దీనిలో చివరి అక్షరం ర్+ ఊ....

అమ్మ...మ్మ... మ్+అ..ఏమే... మే...మ్+ఏ.. ఇలాగే అన్ని మాటల చివర అచ్చు ఉచ్చారణతో ఉంటుంది. ఇలాంటి ఉచ్చారణ లాటిన్ ఇటాలియన్ భాషకు కూడా ఉంది ,అందుకే లాటిన్ భాష కూడా అజంత భాష కాబట్టి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అన్నారు .అందుకే తెలుగు వినడానికి ,అనడానికి అందమైన ఒంపు సొంపుల భాష .తేట తేనెల భాష .సంగీతానికి అనువైన భాష .అమృత నుడుల పాలధారలో పంచదార కలిసిన భాష.మన అమ్మనుడి తెలుగు నుడి.

మన భాషలో ఏది పలుకుతామో అదే వ్రాస్తాము . కానీ కొన్ని భాషలలో అలా ఉండదు మచ్చుకు ఆంగ్లం తీసుకున్నట్లయితే కామ్(ఇఃజీశ్రీఎ) ఇక్కడ ఒ ను పలకము ,అలాగే (జుఐబీబి) పుట్ అయితే ఎబీబి , బుట్ కావాలి,కానీ బట్ అని పలుకుతారు.కానీ తెలుగులో అలా కాదు ,ఎన్ని వ్రాలు పలుకుతామో,అన్ని అక్షరాలే చాలు. మచ్చుకు అమ్మ అనే మాట ఉంటే అ+మ్మ...రెండు అక్కరాలు. అదే ఇంగ్లీషులో మదర్ అంటే మ+ద+ర్=3 వ్రాలు.కానీ ఎనీ,బిప్త్రవ,తీ ఆరు అక్షరాలు కావాలి. పక్కింటి అమ్మాయి అని తెలుగులో వ్రాయాలంటే ఆరు అక్షరాలు చాలు. అదే తమిళంలో పక్కింటి అమ్మాయి అలాంటి అర్థం వచ్చే మాట రాయాలంటే 13 అక్షరాలు కావాలి. అలాగే ఎదురింటోళ్లు తెలుగులో ఐదు అక్షరాలు చాలు .అదే తమిళంలో వ్రాయాలంటే 20 అక్షరాలు అవసరం. అలాగే హిందీలో ఎ ,ఒ అక్షరాలు లేవు ఎ ఏలకు ఒకే అక్షరాన్ని వాడాలి. హిందీలో కొండయ్య వ్రాయాలంటే వ్రాయలేము, కోండయ్య అని రాయాలి. అలాగే ,మాది గొప్ప భాషని చెప్పుకునే తమిళంలో ఖగఘఛజఠడఢథధఫబభ అక్షరాలు లేవు .వారు గాంధీ అని వ్రాయలేరు. వారు కాంతీ అని వ్రాస్తారు. చూశారా మన తెలుగు గొప్పదనం, సౌందర్యం, సౌలభ్యం. కనుక భాషాపరంగా భారతదేశంలో అన్ని భాషల కన్నా మన తెలుగే గొప్ప.

కాబట్టే కన్నడ ప్రభువైన శ్రీకృష్ణదేవరాయల వారు దేశభాషలందు తెలుగు లెస్స అనడం నూటికి నూరుపాళ్ళు నిజం. అలాగే కొన్ని ఎండ్ల క్రితమే బెంగాలీ భాషా వేత్త సునీల్ కుమార్ చటర్జీ గారు మొదట్లో దేశంలో ద్రావిడ భాషలే మాట్లాడే వారిని తర్వాత ఆర్యుల రాకతో సంస్కృతం జనము లోనికి వచ్చిందని చెప్పారు. అలాగే విజయవాడలో డిప్యూటీ కలెక్టర్ గా పనిచేసిన రహంతుల్లా గారు పరిశోధన చేసి తెలుగు దేవ భాషని తెలియజేశారు .ఇంకా చెప్పుకోవాలంటే తమిళ సాహితీవేత్త అప్పయ్య దీక్షల వారు తెలుగు గురించి ఇలా అన్నారు 'ఆంధ్రత్వమాంధ్ర భాషాచనాల్పస్య తపసఃఫలమ్' అంటే ఆంధ్రుడు ఆంధ్ర భాషను పొందడం ఎన్నో తపస్సుల ఫలం అని అన్నారు అలాగే తమిళ కవి శ్రీ సుబ్రహ్మణ్య భారతి వారు తెలుగు గురించి చెబుతూ 'కాశ్మీర్ థారు సరస్సులో పడవలో పయనిస్తూ మలయాళం అమ్మాయి తెలుగు పాట పాడుతూ ఉంటే వినాలని ఉంది' అని వారి కోరిక చెప్పారు. చూశా రా మన తెలుగు గొప్పతనం ఇతర భాషల వారు ఎంతో గొప్ప తెలుగని చెబుతుంటే, మనం మాత్రం తెలుగు వారమై ఉండి ,సిగ్గు లేకుండా, డాలర్ల వ్యామోహంలో పడి పం

**ప్రపంచంలో దాదాపు 6000 భాషలు ఉన్నాయి. వాటిలో సొంత లిపి కలిగి ఉన్న భాషలు దాదాపు 400 లోపు.**

భాష, పరుల సంస్కృతిలో కూరుకుపోతూ, కనీసం కన్న అమ్మను కూడా అమ్మ అని పిలవడానికి సిగ్గుపడుతూ, అమ్మను మమ్మీ అంటే శవంగా పిలుచుకుంటూ ఆనందిస్తున్నాము. ఇందుకు నవ్వుకోవాలో, ఏడ్వాలో మనమే ఆలోచించుకోవాలి.

అయితే ఇప్పటి ప్రభుత్వాలు కూడా తెలుగును రాజకీయానికి వాడుకొంటున్నాయి.ఓట్ల కోసం తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తివేసి ,ఇంగ్లీష్ మాధ్యమాన్ని చదువులలోకి తెచ్చారు. అలాగే మన ప్రభుత్వాలు పూర్తిగా ప్రభుత్వ బడులలో విద్యను నీరసపరుస్తూ, ప్రైవేటు వారికి కొమ్ముకాస్తూ ,ఇంగ్లీష్ మీడియంకు వత్తాసు పలుకుతున్నారు .ఇది ఇలాగే కొనసాగితే మన ప్రభుత్వాలు ,పత్రికలు, టీవీ వారు సాహితీవేత్తలు తెలుగు గురించి పట్టించుకోకపోతే ,ఐక్యరాజ్యసమితి వారి నివేదిక చెప్పినట్లు ,రాబోయే 30 సంవత్సరాలలో మరుగయ్యే భాషలలో తెలుగు ఒకటి అన్నమాట నిజం అవుతుందేమో.నిజమే ఎందుకంటే నేడు తెలుగు వారి పిల్లల్లో 90 శాతము ఇంగ్లీషులో చదువుతున్నారు. వారికి తెలుగు రాయడం, చదవడం రాదు,ఇక తెలుగు అక్షరాలతో పనేముంది ,తర్వాత తరాల వారు తెలుగు అక్షరాలను మ్యూజియంలో చూడవల సిన వస్తుందేమోనని సాహితీవేత్తల ఆవేదన.

ఎందుకంటే ప్రపంచంలో ఇప్పటికే ఇంగ్లీషు ప్రభావం వలన, క్రిస్టియన్ మత వ్యాప్తి జరిగి దాదాపు 300 భాషలు కనుమరుగైపోయాయని, వందల జాతుల సంస్కృతులు నాశనమ య్యాయని నివేదికలు అందాయి. పరభాష నేరవడం తప్పేమి కాదు. ముందు మన మాతృభాష తెలుగునుడిని కాపాడుకుంటూ, తెలుగు నుడిలో విద్యాభ్యాసం చేస్తే పిల్లలకు పాఠాలు సులభంగా అర్థమవుతాయి.ఈ మాటను, మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద, సర్దార్ వల్లభాయ్ పటేల్ ,నేతాజీ వీరంతా కూడా మాతృ భాషలో విద్యా బోధన ఉంటే విద్యార్థికి పాఠం సులభంగా అర్థమవుతుంది. వికాసం ఉంటుంది అని చెప్పారు .అయితే పరాయి భాష నేర్చుకోవడం వలన, మనకు తెలియకుండానే ,ఆ భాషకు చెందిన ఆ భాష వారి సంస్కృతులు, సాంప్రదాయాలు, కట్టుబొట్లు, తినీడి అలవాట్లు మనకు తెలీకుండానే అంటుకుంటాయి. మీరు ఒకసారి ఆలోచించండి ఇంగ్లీషు భాష భారతదేశానికి రాకముందు , మన ప్రజల కట్టుబొట్లు, వస్త్ర ధారణ ఎలా ఉండేది. తర్వాత ఇంగ్లీష్ వారు ప్రవేశించి,వారి భాషను ,వారి మతాన్ని మనపై రుద్దడం వలన, మనకు తెలియకుండానే,వాళ్ళ సంస్కృతి ,వాళ్ల కట్టుబొట్లు ,వాళ్ళుతినే తిండి మన జీవనం లో వచ్చి చేరాయి.అన్ని నేడు మనం చూస్తూనే ఉన్నాము .అంటే ఒక భాష నశిస్తే ,ఆ భాష తెగవారి సంస్కృతి కూడా నాశనం అవుతుంది .అందుకే ఇంగ్లీష్ ఉద్యోగి 'మేకలే'చెప్పినట్లు ఒక జాతి సంస్కృతిని నాశనం చేయాలంటే ,మొదటగా వారి మాతృభాషను నాశనం చేస్తే చాలు ,అని ఆయన అన్న మాటలు ముమ్మాటికీ నిజమే. అవునంటారా! కాదంటారా.!?

**కనీసం కన్న అమ్మను కూడా అమ్మ అని పిలవడానికి సిగ్గుపడుతూ, అమ్మను మమ్మీ అంటే శవంగా పిలుచుకుంటూ ఆనందిస్తున్నాము. ఇందుకు నవ్వుకోవాలో, ఏడ్వాలో మనమే ఆలోచించుకోవాలి.**

ఇక తెలుగు భాష వివరాలకు వస్తే మొదట్లో మూల ద్రావిడ భాషలో తెలుగు అక్షరాలు 26 అచ్చులు 10 హల్లులు 16 తర్వాత సంస్కృత భాష నుండి తెలుగులోనికి అరువు తెచ్చుకున్న అక్షరాలు 19.

ఇక మనం ప్రస్తుతం వ్రాస్తున్న ,మాట్లాడుతున్న మాటలలో ఎక్కువ మాటలు, సంస్కృతానివి ,తర్వాత ఇంగ్లీష్ తర్వాత హిందీ ఉర్దూ మాటలు ఉన్నాయి. మచ్చుకు ఈ మాటలు చూడండి ఎక్కువగా మనం వాడే తెలుగు మాటలలో దాదాపు ఎక్కువ శాతం సంస్కృత పదాలు ఉన్నాయి. అయితే చాలామంది, ఈ మాటలు తెలుగు మాటలు అనుకుంటారు, కానీ నిజానికి ఇవి సంస్కృత పదాలు అని మనలో చాలామందికి తెలియదు .అవి భాష, వర్షం ,నష్టం, కష్టం, లాభం, ఇష్టం ,ప్రేమ ,బాధ, రక్తం భోజనం, అన్నం ,ఇంధనం ,నమస్కారం, సభ, సమాఖ్య ప్రభుత్వం అధికారి, ఉపన్యాసం, వేదిక ,అధ్యాపకుడు, ఉపాధ్యాయుడు ,జన్మ మరణం, విశ్వవిద్యాలయం, కార్యాలయం, కర్షకుడు, విద్య, వైద్యం, దారుణం, హత్య ఉదయం రాత్రి మధ్యాహ్నం భార్య భర్త ,మాత, పిత, భక్తి, భామ, నూతన, సంవత్సరం, ఆహ్వానం, ద్వాదశ దశ దిశ నవ అర్చన దేవాలయం, కృతజ్ఞత ,వందనాలు, కవి ,రచయిత ,కావ్యం ,సాహిత్యం..... ఇలా ఎన్నో నిత్యజీవితంలో వాడే అన్ని తెలుగు మాటలు నిజమైన తెలుగు మాటలు కావు .ఇవన్నీ సంస్కృత సంస్కృత పదాలు.అలాగే మన నిత్య జీవితంలో వాడే హిందీ ఉర్దూ పదాలు చూడండి,.. రోజు, ఖర్చు, జబ్బు ,కిమ్మత్తు ,కాగితం, సుల్తాను ,పద్దు ,సర్కారు ,స్వారీ, తగాదా,శిస్తూ ,జప్తు ,వగైరా ,గుమస్తా, జమీను ,ఆఖరు ,హంగామా, చాకిరి, నౌకరు, తాసిల్దార్, సలాం, జిల్లా, జమీందారు, ఖరీదు, దస్తూరి, ఫిర్యాదు ,ఖైదు ,కబురు ,దివాను, రుమాలు, సాలిన ,చౌరస్తా ,ఇలా ఎన్నో.... ఇక మనం రోజు వాడే ఇంగ్లీషు మాటల గురించి మీకు చెప్పనవసరం లేదు అన్నీ మీకు తెలిసినవే.మన అచ్చ తెలుగు మాటలు, మన మేలిమి తెలుగు మాటలు, జాను తెలుగు మాటలు చాలా వరకు మరుగవుతున్నాయి. వాటిని కూడా మనం నేర్చుకోవలసిన అవసరం ,తెలుసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది .అయితే మన నిత్య జీవిత వాడక లో పరభాష పదాలు వాడరాదని కాదు మన వాదన .అవకాశం ఉన్నంత వరకు మన తెలుగులోనే పరనుడి మాటలకు, కొత్త పదాలు పుట్టించుకోవాలి. అలా వీలుకానప్పుడు ఆ పదాలే వాడుకోవచ్చు, కొత్త మాటలు పుట్టించుకుంటే ,భాష బలపడుతుంది ,ఆపై నిలబడుతుంది ,ఆ పని తమిలులు,కొరియన్లు చైనా వారు, జపాన్ వారు చేస్తున్నారు .ఇంగ్లీషులో ఒక కొత్త మాట రాగానే దానికి సరైన పదాన్ని వారి మాతృభాషలోనే సృష్టిస్తున్నారు .అది వారికి భాష పై ఉన్న అభిమానాన్ని తెలియజేస్తుంది .అలాగే మనం కూడా ఏదైనా కొత్త ఇంగ్లీషు మాట వస్తే, అనుగుణంగా అచ్చ తెలుగు మాటను పుట్టించాలి అలా కాకుండా అందరూ

సంస్కృత మాటనే పుట్టిస్తున్నారు. మచ్చుకు చూడండి టతీవటణవతీ (డ్రె డ జ్ఞర్) అనే ఇంగ్లీష్ పదానికి మన వేల్పు నుడి అనుగరులు తెలుగు మాట పుట్టించకుండా సంస్కృత పదం ఉద్ధృహణ జల యంత్రం అని అనువదించారు.ఎంత మోసం,చక్కగా 'తవ్వోడ' ఉందిగా. అలాగే క్యాలిక్యులేటర్ కు గణక యంత్రం అని సంస్కృత పేరు పెట్టారు. చక్కగా ఎంచు+ఇక"-- ఎంచిక. పెట్ట వచ్చుగా, అలాగే జ్ఞానము అనేదానికన్నా ,ఎరుక ,తెలివిడి ఎంత సులభంగా ఉన్నది, వ్రాయడానికి, పలకడానికి బాగా ఉన్నది. అలాగే కామర్స్ లో బవశ్రీట ఎజీజీశ్రీజీనిఇఃతినిణ శ్రీవటణవతీ ను స్వయం నమానికృత ఆవర్జాలు...అని సంస్కృతీ కరణ చేశారు.అదే అసలు తెలుగు లో 'తా వెల్లడి నిల్వ లెకట్టు'. అలాగే సిగ్నల్ అనే ఇంగ్లీషు మాటకు సంస్కృతంలో 'శకట ఆగమన నిగమన సూచిక' అని సంస్కృత పదాన్ని కనిపెట్టారు. అదే తెలుగులో బండి రాకపోకల చూపిక ఎంత బాగుంది.అలాగే మెడికల్ పుస్తకాలను తెలుగులో అనువదిస్తూ అక సేరులు, సకచేరులు అని అనువదించారు. ఇవి ఏ పిల్లలకైనా అర్థమవుతాయా, అందుకే అందరూ ఇంగ్లీష్ మీడియం చదవడానికి ఒక కారణమైంది. అలాగే కిరణ జన్య సంయోగ క్రియ అందరికీ తెలిసిందే ఇది సామాన్య మానవులకు అర్థం అవుతుందా దీనినే అచ్చ తెలుగులో 'వేడి నిచ్చు కూరిక పని' లేదా వేడి నిచ్చు కలగూడు చేయిక'ఇది అందరికీ అర్థం అవుతుంది. అయితే ఈ అచ్చ తెలుగు మాటలు కొన్ని సందర్భాల్లో, ఎబెట్టుగాను ,కొత్తగాను ,వింతగాను ఉంటాయి. ఎందుకంటే మనం చిన్నతనం నుండి బడిలో ,గుడిలో, పుస్తకాలలో ,అన్ని సంస్కృత పదాలు కలిసిన మిశ్రమ తెలుగును చదవడం వలన ,వినడం వలన ,ఆ పదాలు అందంగా ,వినసొంపుగా అనిపిస్తాయి .ఎందుకంటే చిన్ననాటి నుండి ఆ సంస్కృత పదాలకు మనం అలవాటైపోయాము. అలాకాకుండా చిన్నతనం నుండి అచ్చ తెలుగు మాటలే బడిలో, పుస్తకాలలో, చదివి ,నేర్చి ,మాట్లాడి ఉన్నట్లయితే ,ఇప్పుడా మాటలు చాలా అందంగానూ, వినసొంపుగాను ఉండేవి.కాబట్టి ఇకనైనా మనము ఇతర భాషలలోని మాటలకు తెలుగులో అందరికీ తెల్లమయ్యే మన జన వాడుక అచ్చతెలుగు మాటలను పొందిక చేయవచ్చు కదా !?అలా చేయరు ,ఎందుకంటే వారికి తెలుగంటే దేశ్య మని ,గ్రామ్యమని ,హీనభాషని, లేకీ భాషగా భావిస్తారు,అనువాదలన్నీ సంస్కృత మిళిత ఆంధ్ర భాషనే వాడినారు.అందుకే మేధావులంతా ,గత మహానుభావులంతా తెలుగును చిన్నచూపు చూసి ,వేల్పునుడికి పెద్ద పీట వేశారు . ఇలా నేను అనడం చాలామంది సంస్కృత వాదులకు నాపై చాలా కోపం వస్తుంది, అయినా నిజాన్ని నిక్కచ్చిగా చెప్పక తప్పదు. సంస్కృతం మనపై రుద్దడం వలన మన తెలుగుకు ఈ సంకర గతి పట్టింది .ఇది అందరూ మనస్ఫూర్తిగా అంగీకరించవలసిన నగ్న సత్యం.ఇది మన తెలుగుకున్న పెద్ద ఇబ్బంది.ఇది ఎంతవరకు సబబు . దేవుడి గుడిలో కూడా ప్రార్థనలు తమిళంలోనూ, సంస్కృతంలోనూ ఉంటాయి ,ఎందుకని దేవుళ్లకు ఆ భాషలు అర్థం అయినప్పుడు తెలుగు అర్థం కాదా !? అక్కడ తెలుగులో ప్రార్థనలు చేయవచ్చు కదా ! అలాగే పెళ్లిళ్ల తంతులో కూడా ,ఆ పెళ్లిళ్ల మంత్రాలు ఏమిటో ,ఎవరికి అర్థం కావు. దాంట్లో ఎన్ని తప్పులు ఉన్నాయో ఒప్పులు ఉన్నాయో, వాటి అర్థాలు మనకు తెలియకుండానే ,మన చేత వల్లివేస్తుంటారు. నాతిచరామి అని అంటే ఎంతమందికి అర్థం అవుతుంది, అలాగే ఎవరినైనా తిట్టాలంటే ×గార్దబపుత్ర×× అని అంటే అది తిట్టో, పొగడికో తెల్లము గాదు,అదే ×గాడిద కొడకా× అని అంటే బాగా అర్థమవుతుంది గదా.అలాగే వైష్ణవ గుడులలో తమిళ ప్రాశురాలు చదువుతుంటారు .ఇలా చెప్పుకుంటూ పోతే అనేక శ్లోకాలు, ప్రార్థన గీతాలు , మేలుకొలుపులు, సుప్రభాతాలు అన్ని అర్థం కాని సంస్కృతంలోనే ఉంటాయి. ఏ వాటిని ఎందుకు అచ్చ తెలుగులోకి అనువదించి అందరికీ అర్థమయ్యే రీతిలో చేయడం లేదు.ఒకసారి అందరూ ఆలోచించగలరు.అందుకే అసలు తెలుగు కోసం, అచ్చమైన తెలుగు కోసం ఎందరో మహానుభావులు కృషి చేశారు, వారిలో ముఖ్యంగా గిడుగు రామ్మూర్తి పంతులు వారు ,గురజాడ వారు,విరేశలింగం పంతులుగారు, ఆదిభట్ల నారాయణదాసు గారు, చిలుకూరి నారాయణరావు గారు, నారు నాగనార్యులు,శ్రీ పాద కృష్ణమూర్తి గారు, మారే పల్లి రామచంద్ర కవి,కాళోజీ గారులు..ఇలా ఎందరో మహనభావులు గురించి చెప్పుకోవచ్చు.

కనుక ఇకపై తెలుగు అభిమానులందరూ తెలుగులోనే మాట్లాడుదాం తెలుగులోనే ఆలోచించుదాం. తెలుగునుడికై పోరాడుదాం.తెలుగు వాడుక బాసను కాపాడుకుందాం.



-రాఘవ మాస్టారు కేదారి
9741407099

# స్వీయ చరిత్రలో ఇతరుల చరిత్ర ఆవశ్యకత




నంబూరి పరిపూర్ణ గారి గురించి **“ఒక దీపం వేయి వెలుగులు. నంబూరి పరిపూర్ణ జీవితం సాహిత్యం వ్యక్తిత్వం”**లో 110 వ్యాసాలు రచనలు ఉన్నాయి. ఎ 4 క్రౌన్ సైజులో 368 పేజీలు. ఇందులో వందేళ్ల సామాజిక చరిత్ర రికార్డు చేశారు. వీరి ఉంటాయి మాకు ఉషస్సులు కథలు సంపుటికి విశాల సాహితి పురస్కారం అందించాను. దాశరథి రంగాచార్య జీవనయానంలో నాకు పురస్కారం ఇచ్చి వారి జీవితంలో భాగం చేశారు. విశాల సాహితి పురస్కారం అందించి నంబూరి పరిపూర్ణ గారి జీవితంలో ఒక భాగమయ్యాను. ఇలా ఇరువురితో కుటుంబ సంబంధాలు పెనవేసుకొని పోయాయి. సాహిత్యం జీవితాలను కలుపుతుంది. స్నేహాలు పెంచుతుంది అనడానికివి రెండు ఉదాహరణలు. ఈ పుస్తకం ఎంతమందిని కుటుంబ మిత్రులుగా చేసిందో!

నంబూరి పరిపూర్ణ 1931 జులై 1వ తేదీన కృష్ణాజిల్లా బొమ్మలూరు గ్రామంలో నంబూరి లక్ష్మయ్య, లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. శ్రీనివాసరావు, లక్ష్మీనర్సమ్మ, దుర్వాసరావు, వెంగమాంబ, జనార్ధనరావు వీరి తోబుట్టువులు. ప్రాథమిక విద్య బండారిగూడెం, విజయవాడలోను, హైస్కూలు విద్య మద్రాసు, రాజమండ్రిలోను సాగింది. ఇంటర్మీడియట్ పి.ఆర్. కాలేజి కాకినాడలో, టీచర్ ట్రైనింగ్ సెయింట్ థెరిసా మహిళా కాలేజి ఏలూరులో చేశారు. ప్రైవేటుగా బి.ఎ. పాసయ్యారు. వీరికి దాసరి శిరీష, దాసరి అమరేంద్ర, దాసరి శైలేంద్ర ముగ్గురు సంతానం. 1955-58లో నూజివీడు, ఏలూరు, గోపన్నపాలెంలో టీచర్గా ఉద్యోగం చేసి 1958 నుంచి 1989 దాక సోషల్ అండ్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్గా, తర్వాత కమ్యూనిటీ డెవలప్మెంట్ ఆఫీసర్గా హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో పనిచేశారు. 1989 జులై 1న పదవీ విరమణ చేశారు. దర్శి చెంచయ్య రాసిన ఆత్మకథ **‘నేను నాదేశం’**లో నంబూరి పరిపూర్ణ ఒక భాగమయ్యారు. వీరి గురించి నాలుగు పేజీలు రాశారు.

దర్శి చెంచయ్య గదర్ వీరులలో ఒకరు. జాతీయోద్యమంలో కాంగ్రెస్లో గాంధీజీ కేంద్రం కాక ముందు గదర్ పార్టీ ఉద్యమాలు సాగాయి. అది చరిత్ర. ఆ చరిత్రలో ప్రముఖులు దర్శి చెంచయ్య. దర్శి చెంచయ్య విప్లవకారుడు సంఘ సంస్కర్త. గాంధీజీ పిలుపు నందుకొని హరిజన ఉద్యమంలో పని చేశారు. హరిజన బాలికలకు విద్య అందించాలని భాగ్యరెడ్డి వర్మ 1906 హైదరాబాద్ చాదర్ ఘాట్ లో బాలికల పాఠశాల ప్రారంభించారు. ఇప్పటికీ నడుస్తున్నది. ఇది దళితుడు స్థాపించినది.

1848 లో మహాత్మా జ్యోతి రావు ఫూలే సావిత్రి బాయి ఫూలే బపూనాలో బాలికల పాఠశాల ప్రాంభించారు. వారి జీవిత చరిత్రలో ఎక్కడో షేక్ ఫాతిమా టీచర్ గా పని చేసినట్టు ఒకటి రెండు వాక్యాలు కనబడ్డాయి. వాటి ఆధారంతో షేక్ ఫాతిమా జీవితం గురించి ఆరా తీసి అనేక సాక్ష్యాలు సేకరించి ఆమె జీవిత తరిత్రను సయ్యద్ నశీర్ అహ్మద్ పుస్తకంగా మలిచారు. తొలి ముస్లిం తొలి ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి ఫూలే కృషిలో పాలు పంచుకున్న విషయాలను వెలికి తెచ్చారు. ఆ పాఠశాల శూద్రులు స్థాపించినది.

మద్రాసులో ఒక సేవా సదనం స్థాపించారు. ముత్తా వెంకట సుబ్బారావు దంపతులు గాంధీజీ ప్రేరణతో స్థాపించారు. అది బ్రాహ్మణులు స్థాపించినది. ఏడేళ్లుగా నడుస్తున్నది. అందులో నంబూరి పరిపూర్ణను చేర్పించారు దర్శి చెంచయ్య. నంబూరి పరిపూర్ణ అన్న శ్రీనివాసరావు జాతీయోద్యమంలో జైలుకెళ్లారు. ఆ సందర్భంగా పరిపూర్ణ చదువుకోవడానికి చేర్పించాడు దర్శి చెంచయ్య.

ఆ సేవా సదనంలో కుల వివక్ష అంటరానితనం భరించలేక రెండు రోజులకే ఉండను అని వచ్చేసింది పరిపూర్ణ. అప్పటి నుంచి దర్శి చెంచయ్యగారింట్లో సొంత కూతురులా పెరిగింది. దర్శి చెంచయ్య సోదరి ఆ బాలికను తొలుత అంటరానిదిగా చూసినా రెండు మూడు రోజుల్లోనే మన పిల్లల్లాగే ఉంది అని అక్కున చేర్చుకుంది. జడలు వేయడం ముద్దు చేయడం చేసింది. ఈ వివరాలను దర్శి చెంచయ్య “నేను నా దేశం” స్వీయ చరిత్లో 262-265 పేజీలలో రికార్డు చేశారు. ఇలా ఒకరి జీవితంలో మరెందరో జీవితాలు రికార్డు అవుతుంటాయి. రికార్డు చేయాలి కూడా. **“ఒక దీపం వేయి వెలుగులు - నంబూరి పరిపూర్ణ సంపూర్ణ జీవితం సాహిత్యం వ్యక్తిత్వం”** వ్యాస సంకలనంలో ఆ నాలుగు పేజీలను చేర్చారు.

ప్రొఫెసర్ బండ సరోజన తన స్వీయ చరిత్రలో తన జీవితం పరిధిలో ప్రముఖులైన వ్యక్తుల గురించి ఒక్కొక్క అధ్యాయం చేర్చారు. “నా అంతరంగ తరంగాలు” బిట్ల నారాయణగారి స్వీయ చరిత్రలో ఎందరో జాతీయోద్యమకారులు, కమ్యూనిస్టు ఉద్యమకారుల ప్రసక్తి పరిచయాలు కలిసి పని చేసిన వివరాలు రికార్డు చేశారు. బల్ల సరస్వతి **“కలనేత”** (ఏడు తరాల తలపోత) అనే ఆత్మకథలో ఏడుతరాల సామాజిక పరిణామాలను, వ్యక్తులను రికార్డు చేశారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ఆత్మకథ **“అనుభవాలూ - జ్ఞాపకాలూను”**లో ఎందరో వ్యక్తులు ఆనాటి సంఘటనలు తారసపడతాయి. సంజీవదేవ్ **“తుమ్మపూడి”** స్వీయ చరిత్రలోను అనేక చారిత్రక అంశాలు, చారిత్రక వ్యక్తులు నమోదు చేశారు.

తుమ్మూరి రామ్మోహన్ రావు తన జీవన ప్రస్థానంలో ఇలా కొందరిని రికార్డు చేశారు. ఎలుగందులలో ఉద్యోగం చేసినపుడు వారు మేము ఒకే ఇంట్లో కిరాయకు ఉన్నాము. ఇటీవల వారాల ఆనంద్ యాదోంకి బారాత్ అనే పేరుతో జ్ఞాపకాల రూపంలో సమకాలీన చరిత్ర రికార్డు చేస్తున్నారు. పిన్నంశెట్టి కిషన్ సమకాలీన బాల్య జ్ఞాపకాలను “లేంవాడ కతలు” పుస్తకంగా వెలువరించారు. చెన్నూరి సుగర్శన్ తన ఉపాధ్యాయ జీవితాన్ని అనేక ఘట్టాలుగా కథలవలె అందించారు. పరవస్తు లోకేశ్వర్ తన స్వీయ చరిత్రను నవల వలె థర్డ్ పర్సన్ లో రాశారు.

కథలుగా రాసిన జీవిత చరిత్ర చారిత్రక పాధాన్యత కోల్పోతుంది.

నంబూరి పరిపూర్ణ గురించిన వ్యాస సంకలనం చూసిన తర్వాత ఒక ఆలోచన వచ్చింది. ఈ ఆలోచన కొత్తది కాదు. బండ సరోజన, అంతకు ముందు అందె వెంకట రాజం, జైశెట్టి రమణయ్య గారల స్వీయ చరిత్రలు చదివినపుడే ఈ ఆలోచన కలిగింది. గుమ్మనగారి బాల శ్రీనివాస మూర్తి “ఆత్మకథలో తెలంగాణ చారిత్రక అంశాలు” పుస్తకం చూసినపుడు కూడ ఇదే భావం కలిగింది. రాయలేని వారు రాయలేదు. రాస్తే, రాయగలిగే ప్రతి ఒకరు ఒక చారిత్రక వ్యక్తులవుతారు.

తన చుట్టూ ఉన్న సమాజాన్ని వ్యక్తులను చిత్రించినపుడే వారు కూడ చారిత్రక వ్యక్తులవుతారు. దర్శి చెంచయ్య ఈ పని చేశారు. నంబూరి పరిపూర్ణ “ వెలుగు దారులలో” స్వీయ చరిత్రలో ఈ పని చేశారు. నేను కూడా ఈ దృష్టితో రాస్తున్నాను. కత్తి పద్మారావు వెలువరించిన “ఒక అస్పృశ్యుని యుద్ధగాథ”, “కారంచేడు” అనే రెండు సంపుటాలలోను వందలాదిమందిని రికార్డు చేయడంతో పాటు ఆనాటి తాత్విక భావధారలను చర్చించి శాస్త్రీయ హేతువాద, దళిత ఉద్యమాల భావజాల వ్యాప్తిని ఎలా కొనసాగించారో రికార్డు చేశారు. ఉద్యమాల్లో ఎవరెవరు ఎలా కలిసివచ్చారో చరిత్ర అధ్యయనానికి ఉపయోగపడేవిధంగా నమోదు చేశారు.

స్వీయ చరిత్రలలో ఇతరుల గురించి సంపూర్ణంగా చెప్పే అవకాశం లేకపోవచ్చు. స్వీయ చరిత్ర నిర్మాణంలో సాధ్యం కాకపోవచ్చు. ఆయా సందర్భాలలో రెండు వాక్యాలు రాసినా వారి గురించి సమగ్ర అవగాహన కొరకు సంక్షిప్తంగా ప్రత్యేకంగా ఒక్కొక్క పేజీ అయినా రాసి చేర్చడం అవసరం. ఒక నాయకుడి జీవితంలో వందలాది పరిచయంలోకి వస్తారు. ఉద్యమ నాయకులకు అది సహజం. అలాంటి వారి గురించి రాసేటపుడు దర్శి చెంచయ్యలా, సావిత్రిబాయి ఫూలేలా, బండ సరోజనలా, నంబూరి పరిపూర్ణలా, జైశెట్టి రమణయ్యలా కొన్ని వాక్యాలైనా లింకులు ఇవ్వడం వల్ల ఆ స్వీయ చరిత్రకు చారిత్రక ప్రాధాన్యత పెరుగుతుంది.

ఇలా వంద వ్యాసాలతో “ఒక దీపం వేయి వెలుగులు”, “వెలుగు దారుల్లో” స్వీయ చరిత్రలో నిజంగానే వేయిమంది జీవితాలపై వెలుగు ప్రసరింప జేసింది. అలా వందేళ్ల చరిత్రను రికార్డు చేసిన ఈ రెండు పుస్తకాలు, దాసరి శిరీషగారి గురించిన “శిరీష కోమలం” పుస్తకం మరో వందేళ్ల దాకా చరిత్రగా రోజు రోజుకు ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఏకలవ్యుడి జీవితం చిత్రించేటపుడు మహా భారతం మొత్తం ఉండదు. ఉండకూడదు కూడా. అలా వదిలేయాల్సిన ప్రముఖులను సంక్షిప్తంగా చెప్పి వదిలేస్తారు.

సరిగ్గా కొందరి గురించి చెప్పక పోవడం కూడా మంచిదేమో! కాకపోతే సంక్షిప్తంగా లింకులు ఇచ్చి వదిలేయాలి. ఈ పుస్తకాల్లో అలా కూడా ఎందరో రికార్డయ్యారు. అందువల్ల ఇవి చరిత్ర ప్రధాన్యతగల గ్రంథాలు. ఈ పుస్తకాలను చదువుతుంటే 1901 నుండి నేటిదాకా “దళిత రచయితల, కళాకారుల, మహనీయుల, ఉద్యమ కారుల గురించిన పరిచయాలతో ఒక డిక్షనరీ” వెలువరించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి.

తద్వారా అనేక స్వామ్యాలు తెలుస్తాయి. స్ఫూర్తి ఎన్నో రెట్లు పెరుగుతుంది. జె. ఈశ్వరీబాయి జీవితానికి, టి.ఎన్. సదాలక్ష్మి జీవితానికి, నంబూరి పరిపూర్ణ జీవితానికి మధ్య అనేక పోలికలు కనపడతాయి. ఈశ్వరీబాయి 1918లో సికింద్రాబాద్లో జన్మించారు. 1991 ఫిబ్రవరి 24వ తేదీన ఆమె మరణించారు. శాసనసభ సభ్యురాలిగా ఆమె తన ప్రత్యేకతను నిరూపించు కున్నారు. భర్తతో విడిపోయి స్వయంగా ఎదిగారు. నంబూరి పరిపూర్ణ భర్త దాసరి నారాయణరావు రాజకీయాలలో ఉండడంవల్ల, పార్లమెంటు సభ్యులు కావడంవల్ల పిల్లల పెంపకం కోసం అంకితమై సామాజిక, సాహిత్య కళా రంగంలో తనదైన ముద్రవేశారు. సామాజిక సేవలు అందించారు.

నా విషయానికి వస్తే నిరంతరం ఉద్యమ కార్యకర్తగా, ఆర్గనైజర్గా పనిచేయడంవల్ల నేను రాయాల్సినంతగా రాయలేదు. ఇది నా రచనల గురించిన మాట! నేను రాయాల్సినంతగా రాయలేదు. చాలామంది మిత్రుల గురించి, సాహితీవేత్తల గురించిన మాట!. నేను రాయాల్సినంతగా రాయలేదు. ఈమాట పీఠికలు సందేశాలు,సమీక్షలు, జ్ఞాపకాలు, అనుభవాలు, ఉద్యమాలు గురించిన మాట! నేను రాయాల్సినంతగా రాయలేదు.. ఈ మాట మా అమ్మ గురించి ! నేను రాయాల్సినంతగా రాయలేదు.. తప్పకుండ రాస్తా. నా కోసం రాస్తా. నవీన సమాజం కోసం రాస్తా..!

ఆయా రచయితలు ఉద్యమకారులు తమ వారసులను సంస్కారవంతంగా తీర్చిదిద్దితే ఎంత ఆలస్యంగానైనా వారి చరిత్ర వాసికెక్కుతుంది అనడానికి నంబూరి పరిపూర్ణ పిల్లలు , వారి పిల్లలు బంధువులు ఈ పుస్తకాల ద్వారా నిరూపించారు. సి నారాయణ రెడ్డ గారికి కూడా ఇలా నాలుగవ తరం కూడా ముందుకు వచ్చింది. ఇవన్నీ యువతరం ఆహ్వానించదగిన ఆచరించ వలసిన మార్గ దర్శకాలు. ఈ పుస్తకాల కృషిలో పాలు పంచుకున్న వారందరికి అభినందనలు. శుభాకాంక్షలు. ఈ పుస్తకాల రూప కల్పన భాగస్వాములైన వారందరు కూడా చరితార్థులయ్యారు.



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

# సౌభాగ్యాల లక్ష్మి అమ్మాయి..!!

కూతురు పుట్టింది బంగారు తల్లిలా
పచ్చని ఇంటిలో ఆనందపు అపరంజి గా
మువ్వల సవ్వడులతో ఇల్లంతా కళకళలాడే
అందరి హృదయాల్లో సంతోషపు జల్లులు కురిసే..

అమ్మాయి అంటేనే సంతోషాలకు నిలయం
ఇంటిల్లిపాదికీ మమకారపు సహకారం
చెరగని చిరునవ్వే ఆమె ముఖంపై ఆస్తి
గృహములో వెలసిన దైవం స్వరూపం...

కరుణ గలిగిన మనసు అమ్మలకే సొంతం
కంటనీరు రాకుండా చూడడమే కుటుంబం బాధ్యత
అమ్మాయి కంటనీరే ఇంటికి నరకం
వర్షించే ఆనంద భాష్పాలే స్వర్గతుల్యం..

చదువుల తల్లి సరస్వతిగా విజ్ఞానపు నిధి
ఈది బాధలు దూరం చేసే సాక్షాత్తు లక్ష్మీ రూపం
శక్తి సామర్థ్యాలు లో పార్వతి స్వరూపిణి
ముగ్గురమ్మల మూల రూపాలు అమ్మాయిలే..

అమ్మాయిని చిన్నచూపు ఎప్పటికీ చూడద్దు
ఆకాశములో సగం భాగమై విస్తరిస్తుంది
ప్రతి రంగంలో ప్రత్యేకత చాటుకుంటూ
అవనిలో అర్ధ భాగమై విరాజిల్లుతుంది..

నేటికాలంలో అమ్మాయే కనకపు సింహాసనంపై
సమస్త లోకాన్ని శాసించే స్థాయి వచ్చింది
తేడాలు చూపకుండా ఎదగనీయండి చిన్న మొక్కను
మహా వృక్షంగా నీడనిస్తుంది యావత్తు లోకానికి..



-కొప్పుల ప్రసాద్
9885066235

